www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 70 | ఆదివారం | 18 అక్టోబర్, 2026



చివరి టీ20 వర్షార్పణం

- భారత్–విండీస్ సిరీస్ 2–2తో సమం

7



హైదరాబాద్ మెట్రోకు పెరుగుతున్న నష్టాలు

- ఆరు నెలల్లో రూ.405.86 కోట్ల నష్టం.. గతేడాది కంటే అధికం
- రూ.524.78 కోట్లకు చేరిన ఆదాయం
- రూ.930.64 కోట్లకు పెరిగిన వ్యయాలు
- అప్పుల వడ్డీలకే రోజుకు రూ.2.85 కోట్ల భారం
- స్వాధీన ప్రక్రియలో ప్రతిష్టంభన.. రుణాల రీ షెడ్యూలింగ్‌పై సర్కారు ఆశలు

2



లాకర్ల నుంచి డీమ్యాట్ ఖాతాల్లోకి!

- రికార్డుస్థాయికి చేరువలో పసిడి ధరలు
- ఆభరణాల కంటే డిజిటల్ పెట్టుబడుల వైపే మొగ్గు
- ఆగస్టులో రూ.2,596 కోట్ల నికర పెట్టుబడులు
- గతేడాదితో పోలిస్తే 110 శాతం పెరిగిన డిజిటల్ గోల్డ్ కొనుగోళ్లు
- పడిపోయిన బంగారం దిగుమతుల విలువ

2

72అడుగుల బతుకమ్మ!

అంబర్‌పేటలో దేశంలోనే అతిపెద్ద బతుకమ్మ ఏర్పాటు

నవరాత్రులు, బతుకమ్మ వేడుకలకు తరలివచ్చిన భక్తులు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు హైదరాబాద్‌లో వైభవంగా జరుగుతున్నాయి. అంబర్‌పేటలోని జీహెచ్ఎంసీ మైదానంలో 72 అడుగుల ఎత్తైన భారీ బతుకమ్మను ఏర్పాటు చేశారు. దేశంలోనే అతిపెద్ద బతుకమ్మగా పేర్కొంటున్న ఈ పువ్వు నిర్మాణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శనివారం నవరాత్రులు, బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని భారీ సంఖ్యలో భక్తులు అక్కడికి చేరుకుని వేడుకల్లో పాల్గొన్నారు.

– ప్రజానావ, హైదరాబాద్





చిన్నారులకు ఇంటర్నెట్ నిషేధమొద్దు

అశ్లీల కంటెంట్‌ను ఆదిలోనే అడ్డుకోవాలి

2

- హానికర వీడియోల నిరోధానికి జాతీయ డేటాబేస్ ఏర్పాటు చేయాలి
- బాలల భద్రత, స్వేచ్ఛ రెండూ ముఖ్యమే
- నిషేధిత కంటెంట్‌తో ఆర్జించే సొమ్మును స్వాధీనం చేసుకోవాలి
- గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలి



బ్రెయిన్ క్యాన్సర్ బాలుడికి కేటీఆర్ భరోసా

- వినయ్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు సహకారం
- ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించేందుకు చొరవ
- కుటుంబసభ్యులకు అండగా ఉంటానని హామీ

2

అమెరికాలో వర్క్ పర్మిట్ నిబంధనల మార్పు

- 540 రోజుల ఆటోమేటిక్ పొడిగింపు రద్దు
- భారతీయులపై ప్రభావం

6

గోదావరి–కావేరి అనుసంధానంతో

తెలంగాణకు నష్టం

- తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం స్పందించాలి
- రాష్ట్రానికి రావాల్సిన 968 టీఎంసీల నీటిపై స్పష్టత ఇవ్వాలి
- మౌనం వీడకుంటే కేసీఆర్ నాయకత్వంలో జల పోరాటం
- పోలీసు ఉద్యోగాల సంఖ్యను 25 వేలకు పెంచాలి
- పోలవరం నుంచి నీళ్ల తరలింపునకు ఏపీ ప్రతిపాదనపై హరీశ్‌రావు అభ్యంతరం

గోదావరి–కావేరి నదుల అనుసంధానం పేరుతో తెలంగాణ నీటి హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ఆరోపించారు. పోలవరం నుంచి నదుల అనుసంధానం చేపట్టాలన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపాదన రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగిస్తుందని అన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మౌనం వీడి తెలంగాణ హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



2



గోదావరి–కావేరి అనుసంధానంతో
తెలంగాణకు నష్టం

- పోలవరం నుంచి నీళ్ల తరలింపునకు ఏపీ ప్రతిపాదనపై హరీశ్‌రావు అభ్యంతరం

ప్రజానావ, హైదరాబాద్: గోదావరి–కావేరి నదుల అనుసంధానం పేరుతో తెలంగాణ నీటి హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ఆరోపించారు. పోలవరం నుంచి నదుల అనుసంధానం చేపట్టాలన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపాదన రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగిస్తుందని అన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మౌనం వీడి తెలంగాణ హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పోలవరం నుంచి అనుసంధానంపై అభ్యంతరం

గోదావరి జలాలను తరలించేందుకు ఏపీ ప్రభుత్వం గతంలో పోలవరం–బనకచర్ల, ఆ తర్వాత నల్లమలసాగర్ ప్రతిపాదనలను తెరపైకి తెచ్చిందని హరీశ్‌రావు విమర్శించారు. ఇప్పుడు గోదావరి–కావేరి నదుల అనుసంధానం పేరుతో పోలవరం నుంచి బొల్లపల్లి, నాగార్జునసాగర్, సోమశిల మీదుగా కావేరికి నీటిని తరలించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ ప్రతిపాదనకు సంబంధించి ఏపీ సీఎం అక్టోబరు 7న లేఖ రాయగా, నవంబరు 3న దిల్లీలో జరిగే జాతీయ నీటి అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) సమావేశ ఎజెండాలో ఈ అంశాన్ని చేర్చినట్లు తెలిపారు. నదుల అనుసంధానానికి తాము వ్యతిరేకం కాదని, అయితే తెలంగాణ నీటి వాటాకు నష్టం కలిగించే విధానాలనే వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. గతంలో ప్రతిపాదించిన ఇచ్చంపల్లి నుంచి నాగార్జున సాగర్ మీదుగా అనుసంధానం చేపడితే తెలంగాణలో 2,38,236 ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. పోలవరం నుంచి నీటిని తరలించే ప్రతిపాదనతో రాష్ట్రానికి నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

968 టీఎంసీల వాటాపై స్పష్టత ఇవ్వాలి

తెలంగాణకు రావాల్సిన 968 టీఎంసీల నీటి వాటాకు ముందుగా అనుమతి ఇవ్వాలని, అనుసంధానం ద్వారా తరలించే నీటిలోనూ 50 శాతం వాటా కల్పించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఏపీ సీఎం లేఖ రాసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం స్పందించకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కూడా ఈ అంశంపై తమ వైఖరిని వెల్లడించాలని కోరారు. తెలంగాణ నీటి హక్కులకు భంగం కలిగితే కేసీఆర్ నాయకత్వంలో మరో జలపోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

పోలీసు పోస్టులను 25 వేలకు పెంచాలి

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీసు ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేసేలా నియామకాల సంఖ్యను పెంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. శనివారం పలువురు పోలీసు ఉద్యోగ అభ్యర్థులు, నిరుద్యోగ యువత ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 25 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉండగా, కేవలం 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులకు అన్యాయం చేయడమేనని ఆయన విమర్శించారు. తాజా కానిస్టేబుల్ నియామకాల్లో హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల అభ్యర్థులకు సివిల్, ఏఆర్ కానిస్టేబుల్ పోస్టులు కేటాయించలేదని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పోస్టుల సంఖ్యను 25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

లాకర్ల నుంచి డీమ్యాట్ ఖాతాల్లోకి!

- రికార్డుస్థాయికి చేరువలో పసిడి ధరలు
- ఆభరణాల కంటే డిజిటల్ పెట్టుబడుల వైపే మొగ్గు
- ఆగస్టులో రూ.2,596 కోట్ల నికర పెట్టుబడులు
- గతేడాదితో పోలిస్తే 110 శాతం పెరిగిన డిజిటల్ గోల్డ్ కొనుగోళ్లు
- పడిపోయిన బంగారం దిగుమతుల విలువ



న్యూఢిల్లీ: భారతీయుల బంగారం కొనుగోళ్ల తీరు మారుతోంది. ఆభరణాల రూపంలో కొనుగోలు చేసి లాకర్లలో భద్రపరిచే రోజులు పోయాయి. ఇప్పుడంతా బంగారానికి బదులు డీమ్యాట్ ఖాతాల్లో డిజిటల్ పెట్టుబడులు పెట్టేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఆగస్టులో దేశీయంగా పది గ్రాముల బంగారం ధర 12శాతం పెరిగి రూ.1,58,854కు చేరగా.. అంతర్జాతీయంగా ఔన్సు ధర 13శాతం పెరిగి 4,386 డాలర్లకు చేరింది. దాదాపు మూడు దశాబ్దాల్లోనే బలమైన నెలవారీ పెరుగుదలల్లో ఇది ఒకటి. అయినప్పటికీ ఆభరణాల కొనుగోళ్ల కంటే ఎక్స్ఛేంజీలు, పెట్టుబడి యాప్‌ల వైపు నగదు ప్రవాహం పెరిగింది.

ఈటీఎఫ్‌లలోకి భారీగా పెట్టుబడులు

ఆగస్టులో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)లోకి రూ.2,596.70 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. జులైలో ఇవి రూ.1,559 కోట్లుగా ఉన్నాయి. వరుసగా మూడో నెలలోనూ పెట్టుబడులు పెరిగాయి. దేశంలోని గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.1.91 లక్షల కోట్లకు చేరగా, వీటి వెనుక 121.3 టన్నుల బంగారం నిల్వ ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు 4.22 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. జూన్–ఆగస్టు మధ్య డిజిటల్ గోల్డ్ కొనుగోళ్లు నెలకు సగటున రూ.2,500 కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే ఈసారి కొనుగోళ్లు 110 శాతం పెరిగాయి. ఎంసీఎక్స్‌లో బంగారం ఫ్యూచర్స్ సగటు రోజువారీ టర్నోవర్ 38శాతం పెరిగి రూ.29,500 కోట్లకు చేరింది. మరోవైపు ఆగస్టులో దేశ బంగారం దిగుమతుల విలువ 2.3 బిలియన్ డాలర్లకు పడిపోయింది. జులైతో పోలిస్తే 45 శాతం, గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 58 శాతం తగ్గింది. సెప్టెంబర్ 11 నాటికి దేశీయ బంగారం ధరలు దిగుమతి సమాన ధర కంటే ఔన్సుకు 78 డాలర్లు తక్కువగా ఉన్నాయి. పాత ఆభరణాలను ఇచ్చి కొత్తవి తీసుకునే ధోరణి కూడా దీనికి కారణమైంది. అంటే భారతీయులు బంగారం కొనుగోళ్లను పూర్తిగా తగ్గించడం లేదు. ఆభరణాలకు బదులుగా పెట్టుబడి సాధనాల వైపు మళ్లుతున్నారు.

ఆభరణాలతో పోలిస్తే ప్రయోజనాలు ఎక్కువే

ఆభరణాల తయారీ ఛార్జీలు, జీఎస్టీ, స్వచ్ఛతపై సందేహాలు, తిరిగి విక్రయించే సమయంలో కోతలు పెట్టుబడి రాబడిని తగ్గిస్తాయని ఏట్రామ్ గ్రూప్ వ్యవస్థాపకుడు, సీఈవో దినేశ్ కుమార్ గురుసామి తెలిపారు. గోల్డ్ ఈటీఎఫ్‌లను ఎన్ఎస్ఈ, బీఎస్ఈల్లో కొనుగోలు చేయవచ్చని, షేర్లతో పాటు ఒకే డీమ్యాట్ ఖాతాలో ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. తక్కువ మొత్తాలతో పెట్టుబడి, పారదర్శక ధరలు, సులభంగా విక్రయించే అవకాశం వీటి ప్రయోజనాలని వివరించారు. ఈక్విటీ మార్కెట్లలో ఒడిదొడుకులు ఉన్నప్పుడు బంగారం పెట్టుబడి పోర్ట్‌ఫోలియోకు రక్షణగా ఉపయోగపడుతుందని, అయితే అధిక రాబడుల సాధనంగా చూడకూడదని సూచించారు. ఆగస్టులో కేవలం 4వేల కొత్త గోల్డ్ ఈటీఎఫ్ ఫోలియోలు నమోదయ్యాయి. జనవరి నుంచి జులై వరకు నెలకు సగటున 3.3 లక్షల ఫోలియోలు నమోదవ్వగా, ఇప్పుడు కొత్త పెట్టుబడిదారుల ఆసక్తి తగ్గింది. మొత్తం ఫోలియోల సంఖ్య 1.254 కోట్లకు చేరింది. 2026 జనవరిలో 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1.75 లక్షల గరిష్ఠ స్థాయికి చేరినప్పుడు కూడా భారీగా కొనుగోళ్లు జరిగాయి. ఆ తర్వాత ధరలు తగ్గాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధానంపై అంచనాల మార్పుతో సెప్టెంబర్ 11 నాటికి దేశీయ ధరలు 4.6 శాతం క్షీణించాయి. ఆగస్టు గరిష్ఠ ధరల వద్ద కొనుగోలు చేసినవారు ప్రస్తుతం నష్టాల్లో ఉండే అవకాశం ఉంది. బంగారంపై వడ్డీ లేదా డివిడెండ్ రాదని, ధర పెరిగితేనే రాబడి వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

క్రమబద్ధమైన పెట్టుబడులే మేలు

బంగారంలో పెట్టుబడికి ముందే పోర్ట్‌ఫోలియోలో దాని వాటాను నిర్ణయించుకుని, ధరల పెరుగుదలను చూసి ఒకేసారి భారీగా కొనుగోలు చేయకుండా క్రమంగా పెట్టుబడి పెట్టాలని సూచిస్తున్నారు. సెబీ నియంత్రణలో ఉండే గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్లను పరిశీలించాలని చెబుతున్నారు. యాప్‌ల ద్వారా విక్రయించే డిజిటల్ గోల్డ్‌ సెబీ నియంత్రణలో ఉండదని, అందువల్ల బంగారం భద్రత, విక్రయాలు, నగదుగా మార్చుకునే విధానాలను ముందుగానే తెలుసుకోవాలని సూచిస్తున్నారు. ఆభరణాల కొనుగోలు వ్యక్తిగత అవసరమైతే, పెట్టుబడి కోసం బంగారం కొనడం ఆర్థిక నిర్ణయమని స్పష్టం చేస్తున్నారు. రానున్న పండగలు, పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం డిమాండ్ మెరుగుపడుతుందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా వేస్తోంది. అయితే అధిక ధరలు, ఒడిదొడుకులు కొనుగోళ్లను ఇవి ప్రభావితం చేయవచ్చు. అమెరికా వడ్డీ రేట్లు, డాలర్ విలువ, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లతో పాటు రూపాయి మారకపు విలువ కూడా దేశీయ ధరలను ప్రభావితం చేయనున్నాయి. బంగారాన్ని ధరల పెరుగుదలపై పందెంగా కాకుండా, పెట్టుబడి పోర్ట్‌ఫోలియోకు రక్షణ కల్పించే సాధనంగా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

చిన్నారులకు ఇంటర్నెట్ నిషేధమొద్దు



- అశ్లీల కంటెంట్‌ను ఆదిలోనే అడ్డుకోవాలి
- హానికర వీడియోల నిరోధానికి జాతీయ డేటాబేస్ ఏర్పాటు చేయాలి
- బాలల భద్రత, స్వేచ్ఛ రెండూ ముఖ్యమే
- నిషేధిత కంటెంట్‌తో ఆర్జించే సొమ్మును స్వాధీనం చేసుకోవాలి
- గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పాఠశాలల్లో అవగాహన కల్పించాలి

న్యూఢిల్లీ: ఆధునిక విజ్ఞాన యుగంలో ఇంటర్నెట్ సేవలు పెద్దలతో పాటు చిన్నారులకూ అవసరమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇంటర్నెట్‌ను వినియోగించుకోవడం బాలల ప్రాథమిక హక్కు అని పేర్కొంది. అశ్లీల, అసభ్య కంటెంట్ నుంచి చిన్నారులను రక్షించాలనే ఉద్దేశంతో వారికి ఇంటర్నెట్ సేవలను దూరం చేయడం సరైన పరిష్కారం కాదని అభిప్రాయపడింది. బాలలకు హాని కలిగించే కంటెంట్ డిజిటల్ వేదికల్లోకి ప్రవేశించకుండానే అడ్డుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి, సామాజిక మాధ్యమ సంస్థలకు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయెన్స్' స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన వ్యాజ్యంపై గురువారం 135 పేజీల ఉత్తర్వులు వెలువరించింది. అవి శనివారం అందుబాటులోకి వచ్చాయి. వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాలు, ఇతర డిజిటల్ వేదికల్లో బాలలను లైంగిక దోపిడీకి గురిచేసే, వారిని తప్పుదోవ పట్టించే అశ్లీల, అసభ్య కంటెంట్‌ను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యాప్తి చేయకుండా నిరోధించాలని ధర్మాసనం సూచించింది. ఇలాంటి హానికర కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు 'నేషనల్ హ్యాష్ అండ్ యూఆర్ఎల్ లిస్ట్ డేటాబేస్' ఏర్పాటు చేయాలని కేంద్రానికి తెలిపింది. దీనివల్ల ప్రమాదకర కంటెంట్‌ను డిజిటల్ వేదికలు ముందుగానే గుర్తించి అడ్డుకునే అవకాశం ఉంటుందని పేర్కొంది.

బాలల భద్రత, స్వేచ్ఛ పరస్పర విరుద్ధమైనవి కావని, ఈ రెండింటినీ పొందే హక్కు చిన్నారులకు ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇంటర్నెట్ వినియోగంపై సంపూర్ణ నిషేధం విధిస్తే మారుమూల ప్రాంతాల్లో ఆన్‌లైన్ సేవలపై ఆధారపడే విద్యార్థులు విద్యాపరంగా నష్టపోతారని పేర్కొంది. అంతేకాకుండా, తల్లిదండ్రులకు తెలియకుండా రహస్యంగా ఇంటర్నెట్ వినియోగించే ప్రమాదం పెరుగుతుందని హెచ్చరించింది. బాలల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టే నిషేధిత కంటెంట్‌ను వ్యాపార వనరుగా మార్చుకుని ఆదాయం ఆర్జించే డిజిటల్ వేదికలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం చర్యలు చేపట్టడంతోపాటు, అలాంటి కంటెంట్ ద్వారా ఆర్జించిన సొమ్మును స్వాధీనం చేసుకునే అంశాన్ని పరిశీలించాలని సూచించింది.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం

పాఠశాలల్లో ప్రాథమిక తరగతుల నుంచే చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాను ఉపాధ్యాయులు వివరించాలని సుప్రీం సూచించింది. ఎలాంటి వ్యక్తుల వల్ల ప్రమాదం పొంచి ఉంటుందో పిల్లలకు అవగాహన కల్పించాలని పేర్కొంది. తమ పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తించిన విషయాన్ని చిన్నారులు వెల్లడిస్తే, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

315 మండలాల్లో కరువు ఛాయలు!

- కేంద్రం తక్షణమే ఆర్థిక సాయం అందించాలి: మంత్రి తుమ్మల

ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలోని 315 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. శనివారం కేంద్ర వ్యవసాయ మంత్రి అధ్యక్షతన జరిగిన 'ఖేత్ బచావో అభియాన్' వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆయన రాష్ట్రంలో వ్యవసాయ పరిస్థితులను వివరించారు. వాతావరణ మార్పులతో పంట నష్టాలను ఎదుర్కొంటున్న రైతులకు అండగా నిలిచేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అక్టోబర్ 22 నుంచి నవంబర్ 30 వరకు 'ఖేత్ బచావో అభియాన్' నిర్వహించనున్నట్లు తుమ్మల తెలిపారు. ఐకార్, వ్యవసాయ విశ్వవిద్యాలయాల సిబ్బంది సహకారంతో గ్రామస్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయడంతో పాటు నీటి సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. పంటలు కోతకు వచ్చే వరకు రైతులకు సాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించినట్లు పేర్కొన్నారు. ఎలనినో పరిస్థితుల నేపథ్యంలో సూక్ష్మ సేద్యం విస్తరణకు, మధ్యంతర పంటల సాగుకు అవసరమైన వితనాల కోసం కేంద్రం ప్రత్యేకంగా అదనపు బడ్జెట్ కేటాయించాలని కోరారు.

హైదరాబాద్ మెట్రోకు పెరుగుతున్న నష్టాలు!

- ఆరు నెలల్లో రూ.405.86 కోట్ల నష్టం.. గతేడాది కంటే అధికం
- రూ.524.78 కోట్లకు చేరిన ఆదాయం • రూ.930.64 కోట్లకు పెరిగిన వ్యయాలు
- అప్పుల వడ్డీలకే రోజుకు రూ.2.85 కోట్ల భారం • స్వాధీన ప్రక్రియలో ప్రతిష్టంభన.. రుణాల రీషెడ్యూలింగ్‌పై సర్కారు ఆశలు



ప్రజానావ, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోరైలు నష్టాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. మెట్రో మొదటి దశ ప్రాజెక్టును ఎల్‌అండ్‌టీ నుంచి స్వాధీనం చేసుకుని, రుణాలను రీషెడ్యూల్ చేయడం ద్వారా ఆర్థిక భారాన్ని తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ.. స్వాధీన ప్రక్రియలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. మరోవైపు ఆదాయం స్వల్పంగా పెరిగినా, వ్యయాలు అంతకంటే ఎక్కువగా పెరగడంతో మెట్రో నష్టాలు మరింత విస్తరించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఆరు నెలల్లో రూ.405.86 కోట్ల నష్టాన్ని నమోదు చేసినట్లు ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నమోదైన రూ.380.46 కోట్ల నష్టంతో పోలిస్తే ఇది అధికం.

పెరిగిన ఆదాయం.. అంతకంటే ఎక్కువైన ఖర్చులు

ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో మెట్రో కార్యకలాపాలు, ఇతర మార్గాల ద్వారా రూ.524.78 కోట్ల ఆదాయం సమకూరింది. గతేడాది ఇదే కాలంలో వచ్చిన రూ.497.54 కోట్లతో పోలిస్తే ఆదాయం పెరిగింది. అయితే నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలు, నిర్మాణ, పరిపాలనా ఖర్చులు, రుణాలపై వడ్డీలు, తరుగుదల కలిపి మొత్తం వ్యయం రూ.930.64 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంలో ఈ వ్యయం రూ.878 కోట్లుగా ఉంది. ఆదాయానికి, వ్యయానికి మధ్య భారీ వ్యత్యాసం నష్టాలను పెంచుతోంది.

వడ్డీలకే ఆదాయం సరిపోని పరిస్థితి

మెట్రో ఆర్థిక భారంలో రుణాలపై వడ్డీ చెల్లింపులే ప్రధాన సమస్యగా మారాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో ఫైనాన్స్ వ్యయాలు రూ.522.61 కోట్లుగా నమోదయ్యాయి. మరోవైపు మెట్రో రైళ్ల నిర్వహణకు ఇదే కాలంలో రూ.222.88 కోట్లు ఖర్చయ్యాయి. ప్రాజెక్టు ద్వారా వస్తున్న ఆదాయంలో గణనీయమైన భాగం వడ్డీల చెల్లింపులకే వెచ్చించాల్సి వస్తోంది.

రుణాల రీషెడ్యూలింగ్‌పైనే ఆశలు

మెట్రో మొదటి దశ నిర్మాణం కోసం తీసుకున్న రుణాలపై ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో సగటున 7 నుంచి 8 శాతం వరకు వడ్డీ చెల్లిస్తోంది. ప్రాజెక్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకునే క్రమంలో ఈ రుణాలను రీషెడ్యూల్ చేయడం ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించాలని యోచిస్తోంది. వడ్డీ రేటును 3.5 నుంచి 4 శాతం లోపు తీసుకురాగలిగితే మెట్రో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని భావిస్తోంది. ఈ మేరకు తక్కువ వడ్డీకి రుణాలు అందించే బ్యాంకుల అన్వేషణ బాధ్యతను ఎస్‌బీఐ క్యాప్స్‌కు అప్పగించింది. తాజా ఆరు నెలల గణాంకాల ప్రకారం రుణాలపై వడ్డీ భారం రోజుకు సగటున రూ.2.85 కోట్లుగా ఉంది. స్వాధీన ప్రక్రియ ఎప్పుడు కొలిక్కి వస్తుంది? రుణాలపై వడ్డీ భారం ఎంతమేర తగ్గుతుంది? అన్నది మెట్రో ఆర్థిక భవిష్యత్తుకు కీలకంగా మారింది.

బ్రెయిన్ క్యాన్సర్ బాలుడికి
కేటీఆర్ భరోసా

- వినయ్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు సహకారం
- ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించేందుకు చొరవ
- కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని హామీ



ప్రజానావ, హైదరాబాద్: బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 13 ఏళ్ల బాలుడు కర్నె వినయ్‌కు అవసరమైన వైద్య సహకారం అందిస్తానని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భరోసా ఇచ్చారు. బాలు డికి అందుబాటులో ఉన్న అత్యుత్తమ వైద్యం అందేలా తోడ్పడతానని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నరసింహుల గూడెం గ్రామానికి చెందిన ఆదినారాయణ, అనిత దంపతుల కుమారుడైన వినయ్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి చొరవ తీసుకున్నా రు. ఆయన సహకారంతో బాలుడు శనివారం హైదరాబాద్‌లో కేటీ ఆర్‌ను కలిశా డు. ఈ సందర్భంగా వినయ్ ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్న కేటీఆర్.. మెరుగైన వైద్యం అందిం చేందుకు ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించేలా చొరవ చూపారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగుల కోసం వినూత్న ఆవిష్కరణలు

దివ్యాంగుల జీవితాలను మరింత సులభతరం చేస్తూ, వారిలో ఆత్మ గౌరవం, స్వతంత్రతను పెంపొందించే సాంకేతిక పరిష్కారాల అభివృద్ధికి కృషి చేస్తున్న కైటేకి ఇన్నోవేషన్స్ సంస్థను కేటీఆర్ అభినందించారు. 'వందే భారత్ 2026' లో సంస్థ విశేష గుర్తింపు పొందిన నేపథ్యంలో దాని వ్యవస్థాపకుడు, సీఈఓ రఘుదత్ డెగాలాను ప్రశంసించారు. కైటేకి ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు రఘుదత్ డెగాలా శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిశారు.



ఎల్‌నినోపై బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోంది: కాంగ్రెస్ నేతలు

ప్రజానావ, సిరిసిల్ల: ఎల్ నినో ప్రభావం దేశవ్యాప్త సమస్య అని, దీనిపై బీఆర్ఎస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం రైతులను అయోమయానికి గురిచేస్తున్నారని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు ఆరోపించారు. శనివారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014, 2015లో రైతులకు ముందస్తు అవగాహన కల్పించకపోవడం వల్లే పంట నష్టాలు, రైతుల ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎల్ నినో ప్రభావంపై అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై సూచనలు చేస్తోందన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆకునూరి బాలరాజు, బొప్ప దేవయ్య, గాజుల నరేష్, పత్తిపాక లక్ష్మీ రాజం, వెంగళ అశోక్, రాగుల జగన్, బూర యాదగిరి, ఇప్పపూల లక్ష్మణ్, వంగరి అనిల్, గాజుల సాగర్, అలవాల సత్యనారాయణ, కొండ ప్రకాష్, సదుల గంగాధర్ పాల్గొన్నారు.

భివండీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

ఆకట్టుకున్న 25 అడుగుల బతుకమ్మ

ప్రజానావ, ముంబై: మహారాష్ట్రలోని భివండీ పద్మనగర్‌లో మార్కండేయ మహాముని వాచనాలయ సమితి, స్వాభిమాన్ సేవ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వాచనాలయం 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 25 అడుగుల భారీ బతుకమ్మను ఏర్పాటు చేశారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మ చుట్టూ మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ వేడుకలకు భివండీ కార్పొరేషన్ ప్రభాగ్ సమితి సభాపతి రజిత మోహన్ కొండ, కార్పొరేటర్లు, పద్మశాలి సమాజ్ ప్రతినిధులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను మహారాష్ట్రలో కొనసాగించడం ఆనందంగా ఉందని బీజేపీ నేత, కార్పొరేటర్ సంతోష్ పెట్టి పేర్కొన్నారు. వేడుకల అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, పులిహోర ప్రసాదం, చిరుకానుకలు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వాచనాలయ సమితి అధ్యక్షుడు గౌడ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పాము ఈశ్వర్ తదితర కమిటీ సభ్యులు కృషి చేశారు.

మైనర్‌పై లైంగిక దాడి..

తండ్రికి సహజ మరణం వరకు జైలు శిక్ష

ప్రజానావ, ముంబై: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కన్న తండ్రికి హింగోలి జిల్లా కోర్టు సహజ మరణం వరకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1.02 లక్షల జరిమానా విధించింది. జిల్లా జడ్జి ఎస్.ఎన్. మానే గడేకర్ శనివారం ఈ తీర్పు వెలువరించారు. 2023 ఏప్రిల్‌లో బాలికపై తండ్రి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు నమోదైన కేసులో 12 మంది సాక్షులను విచారించిన అనంతరం కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించింది. బాధితురాలికి మనోధైర్య యోజన కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్

తెలంగాణ సంస్కృతి, ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ



ప్రజానావ, హైదరాబాద్ : సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి, ప్రకృతి ఆరాధనకు, మహిళా శక్తికి బతుకమ్మ ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పూలతో బతుకమ్మను అలంకరించి గౌరమ్మను ఆరాధించడం ప్రకృతితో మనకున్న విడదీయరాని అనుబంధానికి నిదర్శనమని తెలిపారు. ఈ పండుగ ప్రజల్లో భక్తిభావాన్ని, సాంస్కృతిక వారసత్వంపై గౌరవాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. గౌరమ్మ ఆశీస్సులతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలు కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు గవర్నర్ తెలిపారు.

డైనేజీ సమస్యతో 10వ వార్డు ప్రజల అవస్థలు

మురుగు నీటితో దుర్గంధం.. పట్టించుకోని అధికారులు



ప్రజానావ, ఆర్మూర్ : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని 10వ వార్డులో డ్రైనేజీ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు రోడ్లపైకి చేరడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. దోమల బెడద పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారుల మధ్య సమన్వయ లోపంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించి, వెంటనే రోడ్డు, డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.







ప్రకృతి పరిరక్షణకు బతుకమ్మ స్ఫూర్తి

- **గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**
- **అంబర్‌పేటలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు**
- **సంస్కృతిని కాపాడుకుంటూ ఆధునికత వైపు అడుగులు వేయాలి**
- **జలవనరుల పరిరక్షణ అందరి బాధ్యత**
- **ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదైన నేపథ్యంలో**
- **పాడుపు గా నీటిని వాడుకోవాలి**
- **వేడుకల్లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**

ప్రజానావ, హైదరాబాద్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రకృతిపై ప్రేమను, మహిళా శక్తిని, సామాజిక ఐక్యతను చాటుతుందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. సాంస్కృతిక మూలాలను పరిరక్షించుకుంటూనే ఆధునికత వైపు పయనించాలని యువతకు పిలుపునిచ్చారు. జలవనరుల సంరక్షణ సామూహిక బాధ్యతగా గుర్తించి, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని అంబర్‌పేట ఎంసీహెచ్ మైదానంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గవర్నర్ సతీమణి శ్రీమతి జానకి శుక్లా, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. సుమారు 25 క్వింటాళ్ల వివిధ రకాల పూలతో రూపొందించిన 72 అడుగుల భారీ బతుకమ్మ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. తొమ్మిది రోజుల పాటు జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ సమృద్ధమైన సాంస్కృతిక వారసత్వానికి, జానపద సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. తంగేడు, గునుగు, బంతి వంటి స్థానిక పూలను పేర్చి బతుకమ్మను రూపొందించడం ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని చాటుతుందని పేర్కొన్నారు. మహిళలు బతుకమ్మ చుట్టూ చేరి పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సంప్రదాయాలను సజీవంగా ఉంచుతున్నారని, ఈ వేడుకలు పరస్పర ప్రేమ, ఐక్యతకు ప్రతీకలని అన్నారు.

నీటి పొదుపు మనందరి బాధ్యత

బతుకమ్మ పండుగకు ప్రకృతితో విడదీయలేని సంబంధం ఉందని గవర్నర్ పేర్కొన్నారు. పూలతో బతుకమ్మను అలంకరించడం, అనంతరం జలవనరుల్లో నిమజ్జనం చేసే సంప్రదాయం నీటి వనరులు, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గుర్తుచేస్తుందన్నారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో తెలంగాణ ప్రజలు నీటి వినియోగంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సంప్రదాయ పండుగలు ప్రకృతితో సమతుల్యతను పాటిస్తూ జీవించాలనే సందేశాన్ని అందిస్తాయని వివరించారు.

తెలంగాణ ఉద్యమాల్లోనూ కీలక పాత్ర

హైదరాబాద్ విమోచన ఉద్యమ కాలంలో, తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమంలోనూ ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో బతుకమ్మ కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ పండుగ ప్రాంతీయ సాంస్కృతిక గుర్తింపును, ప్రజల ఆకాంక్షలను బలంగా ప్రతిబింబించిందని పేర్కొన్నారు.

జాతీయ స్థాయిలో బతుకమ్మకు గుర్తింపు

తెలంగాణకే పరిమితమైన బతుకమ్మ పండుగకు జాతీయ స్థాయిలోనూ గుర్తింపు లభిస్తుండటం సంతోషకరమని గవర్నర్ అన్నారు. 2022 సెప్టెంబరులో కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలోని కర్తవ్య పథ్‌పై బతుకమ్మ వేడుకలు నిర్వహించడం ఈ సంప్రదాయానికి దేశవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చిందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రాంతీయ సంప్రదాయాలు, జానపద వారసత్వాన్ని దేశవ్యాప్తంగా పరిచయం చేయడంలో దోహదపడతాయని చెప్పారు. అంబర్‌పేటలో 25 క్వింటాళ్ల పూలతో 72 అడుగుల భారీ బతుకమ్మను రూపొందించడం విశేషమని పేర్కొన్న గవర్నర్, ఈ వేడుక ద్వారా బతుకమ్మ వైభవం మరింత విస్తృతంగా ప్రజలకు చేరుతోందన్నారు. సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించడంతో పాటు సహజ వనరులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బతుకమ్మ, నవరాత్రి, దసరా శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్.. అమ్మ గౌరీ కృపతో ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.



వేయిస్తంభాల ఆలయంలో భవానీదేవిగా రుద్రేశ్వరి దర్శనం

- **300 మంది బ్రాహ్మణ మహిళలకు చీరల పంపిణీ**
- **మహాచండీయాగం నిర్వహణ**

ప్రజానావ, హనుమకొండ : చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు రుద్రేశ్వరిదేవిని తామర పూలతో అలంకరించి భవానీదేవిగా భక్తులకు దర్శనం కల్పించారు. దద్దోజనం నివేదించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల నక్షత్రాన్ని పురస్కరించుకొని 300 మంది బ్రాహ్మణ మహిళలకు చీర, బొట్టు, గాజులు, తాంబూలాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి–నీలిమ దంపతులు, ఆయన తల్లిదండ్రులు నరేందర్‌రెడ్డి–జయమాల 7, 10వ డివిజన్లకు చెందిన బ్రాహ్మణ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే దంపతులు యాగశాలలో గణపతి, నవగ్రహ, రుద్ర పూజలతో పాటు 18 సప్తశతి అధ్యాయాలతో మహాచండీయాగం నిర్వహించారు. అనంతరం భవానీదేవికి వాహనసేవ చేపట్టారు. ఆలయ వేదపండితులు గంగు మణికంఠశర్మ, భరత్‌శర్మ, దత్త కుమారశర్మ, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో డి. అనిల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవియాదవ్, కోన శ్రీకర్, పల్లం రమేష్ పాల్గొన్నారు.

సాలార్‌జంగ్ మ్యూజియం ఆధునికీకరణకు ప్రాధాన్యం

- **గ్యాలరీల అభివృద్ధి, విద్యా కార్యక్రమాల విస్తరణకు గవర్నర్ సూచన**



ప్రజానావ, హైదరాబాద్ : సాలార్‌జంగ్ మ్యూజియంను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునికీకరించి, సందర్శకులకు మెరుగైన అనుభూతిని అందించాలని గవర్నర్ శివప్రతాప్ శుక్లా సూచించారు. శనివారం లోక్‌భవన్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన మ్యూజియం బోర్డు సమావేశంలో 13 అజెండా అంశాలపై చర్చించారు. గ్యాలరీల అభివృద్ధి, అరుదైన కళాఖండాల ప్రదర్శన, విద్యా కార్యక్రమాల విస్తరణ, సందర్శకుల సౌకర్యాల మెరుగుదలపై దృష్టి సారించారు. కార్పెట్, ఆధునిక కళలు, భారతీయ సూక్ష్మ చిత్రాలు, బొమ్మలు–టాక్సిడెర్మీ, ఫర్నిచర్, వస్త్రాలు, పిల్లల గ్యాలరీల ఆధునికీకరణతోపాటు సంగీత గడియారం ప్రదర్శన ప్రాంతం అభివృద్ధి, తాత్కాలిక ప్రదర్శనల కోసం ప్రత్యేక గ్యాలరీ, మెట్ల బావి అభివృద్ధి, సందర్శకుల కోసం పరస్పర సమాచార కేంద్రం ఏర్పాటుపై ప్రతిపాదనలు సమర్పించారు. కేంద్రీకృత శీతలీకరణ వ్యవస్థ, మరుగుదొడ్ల అభివృద్ధి, భవనం పైకప్పుకు నీటి నిరోధక ఏర్పాట్లు, లిఫ్టుల మెరుగుదల, అదనపు లిఫ్టు ఏర్పాటు, అతిథి గృహం పునరుద్ధరణ వంటి అంశాలను కూడా చర్చించారు. మ్యూజియం గుర్తింపు పెంచేందుకు సూచిక బోర్డులు, అగ్నిమాపక భద్రతా సూచనలు, మాస్టర్ ప్లాన్ రూపకల్పనపైనా సమీక్షించారు. విద్యా కార్యక్రమాలపై క్యూరేటర్ జ్యోతి రాయ్, గ్యాలరీల ఆధునికీకరణపై క్యూరేటర్ రితేష్ శర్మ ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మ్యూజియంలు చరిత్ర, కళలు, నాగరికతా వికాసాన్ని భావితరాలకు పరిచయం చేసే విజ్ఞాన కేంద్రాలని పేర్కొన్నారు. కళాఖండాల విశిష్టతను సులభంగా అర్థమయ్యేలా ఆధునిక సాంకేతికతను వినియోగించాలని, పిల్లలు, యువతను ఆకర్షించే విద్యా కార్యక్రమాలు, పరస్పర సమాచార ప్రదర్శనలను విస్తరించాలని సూచించారు. మౌలిక సదుపాయాల మెరుగుదలతోపాటు చారిత్రక సంపద పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరీ సూరజ్ కుమార్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీహెచ్ఎంసీ ప్రత్యేక అధికారి జయేష్ రంజన్, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మోలుగారం, అకౌంటెంట్ జనరల్ వి.ఎం.వి. నవల్ కిషోర్, బోర్డు సభ్యులు, మ్యూజియం అధికారులు పాల్గొన్నారు.

అమెరికా ఒత్తిడికి తలొగ్గేది లేదు

- **అణ్వాయుధాల తయారీపై ప్రచారం అవాస్తవం**
- **ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్పష్టం**




యెరెవాన్ : ఇరాన్ అణ్వాయుధాల తయారీకి ప్రయత్నిస్తోందన్న ప్రచారం పచ్చి అబద్ధమని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పష్టం చేశారు. ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా అమెరికా ఒత్తిడికి తలొగ్గేది లేదని తేల్చిచెప్పారు. జీవవైవిధ్య సదస్సు సందర్భంగా అర్మేనియా రాజధాని యెరెవాన్‌లో జార్జియా ప్రధాని ఇరాక్లీ కొబాఖిద్జేతో జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అణ్వాయుధాల అభివృద్ధిని నిషేధిస్తూ ఇరాన్ మాజీ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ గతంలోనే స్పష్టమైన వైఖరి తీసుకున్నారని గుర్తుచేశారు. ఇరాన్ ఎప్పుడూ చర్చలకు సిద్ధంగానే ఉందని, అయితే తమను బలవంతంగా లొంగదీసుకోవాలనే ప్రయత్నాలను అంగీకరించబోమని పేర్కొన్నారు. అమెరికా విధిస్తున్న ఆంక్షలు మానవతా సూత్రాలకు విరుద్ధమని విమర్శించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ఇటీవల జరిపిన దాడులను అన్యాయమైన, అమానవీయ చర్యలుగా అభివర్ణించారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని తాము వ్యతిరేకిస్తామని జార్జియా ప్రధాని కొబాఖిద్జే పేర్కొన్నారు. అర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తో జరిగిన మరో సమావేశంలోనూ పెజెష్కియాన్ అమెరికా వైఖరిపై విమర్శలు గుప్పించారు. ఇరాన్ లొంగిపోదనే వాస్తవాన్ని వాషింగ్టన్ గుర్తించాలని, ఆంక్షలు ఇరాన్‌తో పాటు ప్రపంచ దేశాలకూ సమస్యలు సృష్టిస్తున్నాయని అన్నారు. అమెరికా ఇదే విధానాన్ని కొనసాగిస్తే ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు మరింత దిగజారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బలప్రయోగానికి బదులుగా తర్కబద్ధమైన చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని అమెరికాకు పిలుపునిచ్చారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు హెల్ప్‌డెస్క్ ప్రారంభం

ప్రజానావ, లింగాల గణపురం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కోసం బీఆర్ఎస్ నాయకులు శనివారం మండల కేంద్రంలో హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించారు. స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మండలంలో సుమారు 1,700 మంది పట్టభద్రుల ఓట్లు ఉండగా, డిగ్రీ పూర్తిచేసిన కొత్తగా మరో 200 మంది అర్హులు ఉన్నారని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులంతా ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలు అందిస్తే హెల్ప్‌డెస్క్ ద్వారా నమోదు ప్రక్రియలో సహకరిస్తామని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, పట్టభద్రులంతా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాన్ని మండల నాయకులు గట్టగళ్ల శ్రీహరి, నల్ల రాహుల్ ప్రారంభించగా గండి వరప్రసాద్, అనిల్, రమేష్, మల్లేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో శ్రీవల్లికి కాంస్య పతకం



ప్రజానావ, తాండూర్ : రాష్ట్రస్థాయి అండర్–17 రెజ్లింగ్ పోటీల్లో అచ్చలాపూర్ జడ్పీ హెచ్ఎస్ విద్యార్థిని కే. శ్రీవల్లి కాంస్య పతకం సాధించింది. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మైత్రి గ్రౌండ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పదో తరగతి చదువుతున్న శ్రీవల్లి మూడో స్థానంలో నిలిచినట్లు పీడీ సాంబమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. ఉమాదేవి, సర్పంచ్ మారిశెట్టి స్రవంతి, ఉపసర్పంచ్ గట్టు సంతోష్‌కుమార్, వార్డు సభ్యుడు పాపయ్య, ఏఏపీసీ చైర్మన్ చిలకమ్మ, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

నగంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ సస్పెన్షన్

విధుల నిర్లక్ష్యం, థర్డ్ డిగ్రీ ఆరోపణల నేపథ్యంలో శాఖాపరమైన చర్యలు

ప్రజానావ, రాజన్న సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసిన శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీజోన్–1 ఐజీ, జోన్–3 రాజన్న ఇన్‌చార్జి డీఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి ఐపీఎస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తనకు వ్యతిరేకంగా జర్నలిస్టుల వార్త కథనాలు రాశారని కక్షతో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు, థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సస్పెన్షన్ కాలంలో ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లరాదని ఎస్ఐ శ్రీకాంత్‌ను ఆదేశించారు.



బోథ్‌లో సోయాబీన్ కొనుగోళ్లు ప్రారంభం

ప్రజానావ, బోథ్ : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సోయాబీన్ కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. తెలంగాణ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు తమ సోయాబీన్ పంటను కొనుగోలు కేంద్రంలో విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు. కొనుగోళ్లు సజావుగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మార్కెట్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మిడ్జిల్ మండలంలో వైభవంగా దేవీ నవరాత్రి వేడుకలు

- ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు
- ఆకట్టుకున్న కోలాట ప్రదర్శనలు

ప్రజానావ, మిడ్జిల్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలతో మిడ్జిల్ మండలంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మండల కేంద్రంతో పాటు మల్లాపూర్, వడియాల, దోనూరు, వసుపుల, అయ్యవారిపల్లి, వేముల, బైరంపల్లి గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండపాల్లో కొలువుదీరిన అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కోలాట ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో సర్పంచులు శంకర్, శ్రీనివాస్ గౌడ్, సంధ్య, చంద్రయ్య గౌడ్, గోపాల్, వెంకట రాములు, గ్రామస్థులు, ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరు మృతి.. ఐదుగురికి గాయాలు

బొలెరోను వెనుక నుంచి ఢీకొట్టిన లారీ

ప్రజానావ, వైరా : ఖమ్మం జిల్లా వైరా మండలం సోమవరం గ్రామ సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి ఎగ్జిట్ వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. దేవరపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న బొలెరో వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. బొలెరోలో ప్రయాణిస్తున్న మల్లేశ్ (32), ఉపేందర్ (40) అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేను నీకు అండగా ఉంటా.. భయపడకు

- బ్రెయిన్ క్యాన్సర్ బాలుడికి కేటీఆర్ భరోసా
- మెరుగైన వైద్యం అందిస్తామని హామీ
- బాలుడి కోరిక మేరకు ఆత్మీయ పలకరింపు



ప్రజానావ, ఖమ్మం : బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. భయపడవద్దని, మెరుగైన వైద్యం అందించేందుకు ప్రయత్నిస్తామని భరోసా ఇచ్చారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నరసింహులగూడెం గ్రామానికి చెందిన కర్నె ఆదినారాయణ, అనిత దంపతుల 13 ఏళ్ల కుమారుడు వినయ్ బ్రెయిన్ క్యాన్సర్‌తో పోరాడుతున్నాడు. కేటీఆర్‌ను కలిసి ఆయనతో ఫొటో దిగాలన్నది వినయ్ కోరిక. ఈ విషయం స్థానిక నేతల ద్వారా తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ బాలుడి పరిస్థితిని, కోరికను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వినయ్‌ను కుటుంబ సభ్యులతో కలిసి కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి కల్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ 'హాయ్ వినయ్' అంటూ ఆప్యాయంగా పలకరించి, ఏ తరగతి చదువుతున్నావని అడిగారు. తాను ఎనిమిదో తరగతి చదువుతున్నానని వినయ్ చెప్పగా, 'ఏం కాదు.. నువ్వు బాగవుతావు.. బాధపడకు.. మందులు వేసుకో.. నీకు చికిత్స చేయిస్తా' అంటూ ధైర్యం చెప్పారు. అనంతరం బాలుడికి బహుమతి అందించారు. వినయ్ తల్లిదండ్రుల తో మాట్లాడుతూ ఆందోళన చెందవద్దని, బాలుడికి ఉత్తమ వైద్యం అందించేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన మెరుగైన వైద్య సహాయం అందేలా చూస్తామని భరోసా ఇవ్వడంతో వినయ్ కుటుంబ సభ్యులు కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

థార్ కార్ల రేసింగ్.. మహిళ మృతి


- భూత్పూర్‌లో బైక్‌ను ఢీకొన్న కార్లు
- భర్తకు తీవ్ర గాయాలు
- చిన్నారికి స్వల్ప గాయాలు



ప్రజానావ, మహబూబ్‌నగర్ : యువకుల కార్ల రేసింగ్ ఓ మహిళ ప్రాణాన్ని బలిగొంది. రెండు థార్ కార్లతో పోటీపడి వేగంగా వెళ్తూ బైక్‌ను ఢీకొట్టడంతో షహానా బేగం (40) అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె భర్త షాకీర్ తీవ్రంగా గాయపడగా, తల్లి ఒడిలో ఉన్న చిన్నారి ఆయారాకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషాద ఘటన భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో చోటుచేసుకుంది. షాకీర్ తన భార్య షహానా బేగం, కుమార్తె ఆయారాతో కలిసి బంధువు వివాహానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా, అమిస్తాపూర్ యూపీఎస్ పాఠశాల సమీపంలో రెండు థార్ కార్లతో రేసింగ్ చేస్తున్న యువకులు వారి బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో షహానా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, షాకీర్‌కు కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే ఓ కారు అక్కడి నుంచి వెళ్లిపోగా, మరో కారును స్థానికులు వెంబడించి పట్టుకున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమైన వారిపై దర్యాప్తు చేపట్టారు. యువకుల రేసింగ్ సరదా ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులపై నిర్లక్ష్యంగా, ప్రమాదకరంగా వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి కష్టాలు ఇక తప్పవా?

- భూగర్భ జలాలు అడుగంటుతున్న
- మధిర, ఏదులాపురం, సత్తుపల్లిలో పడిపోతున్న నీటిమట్టాలు
- పైపులైన్ల లీకేజీలతో వృథాగా పోతున్న తాగునీరు
- వేసవిపై ఆందోళన



ప్రజానావ, ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిర, ఏదులాపురం, సత్తుపల్లి మున్సిపాలిటీల్లో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు తాగునీటి పైపులైన్ల లీకేజీలతో నీరు వృథాగా పోతుండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మధిరలో గతేడాది సెప్టెంబరులో 0.92 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలమట్టం ఈ ఏడాది అదే నెలలో 3.92 మీటర్లకు పడిపోయింది. పట్టణంలో 35 వేలకుపైగా జనాభాకు రోజుకు 5.17 ఎంఎల్‌డీ (సుమారు 51.7 లక్షల లీటర్లు) నీరు అవసరం కాగా, వైరా రిజర్వాయర్ నుంచి 3.5 ఎంఎల్‌డీ సరఫరా చేస్తున్నారు. మిగిలిన 2.12 ఎంఎల్‌డీ నీటిని వైరానది పంపహౌస్‌తోపాటు మడుపల్లి, అంబారుపేట, ఇల్లందులపాడు ప్రాంతాల్లోని మోటార్ల ద్వారా అందిస్తున్నారు. పట్టణంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ, భూగర్భ విద్యుత్ కేబుళ్ల నిర్మాణ పనులతో నిత్యం ఏదో ఒకచోట తాగునీటి పైపులైన్లు దెబ్బతింటున్నాయి. దీంతో లక్షల లీటర్ల నీరు వృథాగా రోడ్లపైకి చేరుతున్నట్లు అంచనా. ఎంప్లాయీస్ కాలనీ, ముస్లిం కాలనీ, హనుమాన్ కాలనీ, వరదరాఘవాపురం, బంజారా కాలనీ, ఎస్సీ కాలనీలకు తరచూ సరిపడా నీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లీకేజీలను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేస్తున్నప్పటికీ రానున్న వేసవిలో స్థానిక నీటి వనరుల నుంచి సరిపడా నీటిని అందించడం కష్టమవుతుందని తాగునీటి విభాగం సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏదులాపురంలోనూ భూగర్భ జలాల పతనం

ఏదులాపురం మున్సిపాలిటీలోనూ నీటి ఎద్దడి ఛాయలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పలు కాలనీల్లో బోర్లు ఎండిపోతున్నాయి. పదేళ్ల క్రితం ఏదులాపురం చెరువు ఇంకిపోవడంతో స్థానికులు తీవ్ర తాగునీటి కష్టాలు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం గుర్రాలపాడు, మారెమ్మగుడి, నాయుడుపేట కాలనీల్లోని మూడు పరిశీలనా కేంద్రాల వివరాల ప్రకారం సెప్టెంబరు నెలాఖరుకు భూగర్భ జలమట్టం సరాసరి 1.27 అడుగులు తగ్గినట్లు లెక్కలు చెబుతున్నాయి. మున్సిపాలిటీలో సుమారు 20 వేల కుటుంబాలు, 70 వేలకు పైగా జనాభా ఉన్నట్లు అనధికారిక అంచనాలు పేర్కొంటున్నాయి. రోజుకు 6.5 ఎంఎల్‌డీ నీరు అవసరం కాగా ప్రస్తుతం 5 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా ఏదులాపురం చెరువు ఆధారంగా మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నారు. చెరువులోకి సాగర్ జలాలను తరలించామని, మరో మూడు నెలల వరకు తాగునీటి ఇబ్బందులు ఉండవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పలు కాలనీల్లో కొత్తగా 15 బోర్లు ఏర్పాటు చేశామని, మరో 10 బోర్లు వేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అయినప్పటికీ ముత్తగూడెం ఎస్సీ కాలనీ, శ్రీరాం నగర్, లక్ష్మీ బృందావనం, ఆర్ఎస్ నగర్, పెద్దతండా, సాయి బృందావనం కాలనీ, వెంకటగిరి క్రాస్‌రోడ్డు, గుదిమళ్ల, తెల్దారుపల్లి, మద్దులపల్లి కాలనీల్లో నీటి ఎద్దడి ఇప్పటికే మొదలైంది.

సత్తుపల్లిలో లీకేజీలతో నీటి వృథా

సత్తుపల్లి మున్సిపాలిటీలోనూ భూగర్భ జలమట్టం ఆందోళనకరంగా పడిపోతోంది. గతేడాది సెప్టెంబరులో 160 అడుగుల లోతులో ఉన్న జలమట్టం ప్రస్తుతం పలు ప్రాంతాల్లో 180 అడుగులకు చేరింది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో 220 నుంచి 250 అడుగుల లోతుకు పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలు సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. పట్టణంలో 18 చోట్ల లీకేజీలను గుర్తించగా, రెండు ప్రాంతాల్లో మాత్రమే మరమ్మతులు చేపట్టారు. మరో 16 చోట్ల లీకేజీలను అరికట్టాల్సి ఉంది. వీటి కారణంగా సుమారు 20 శాతం తాగునీరు వృథాగా పోతున్నట్లు అంచనా. ఏటా వేసవిలో జలగంనగర్, ఎన్టీఆర్ నగర్, వెంగళరావునగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఏర్పడుతోంది. ఈ ఏడాది కూడా ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే సమస్య మొదలైంది. భూగర్భ జలాల తగ్గుదల, పైపులైన్ల లీకేజీలు, పెరుగుతున్న నీటి అవసరాలు మూడు మున్సిపాలిటీల్లోనూ తాగునీటి సరఫరాకు సవాలుగా మారుతున్నాయి. వేసవి తీవ్రత పెరగకముందే లీకేజీలను పూర్తిస్థాయిలో అరికట్టి, ప్రత్యామ్నాయ నీటి వనరులను సిద్ధం చేయకపోతే ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పేలా లేవు.

రైస్ మిల్లుల్లో విజిలెన్స్ తనిఖీలు

- సీఎంఆర్ ధాన్యం నిల్వల్లో అవకతవకల ఆరోపణలు
- కోట్ల విలువైన ధాన్యం మాయమైనట్లు అనుమానాలు

ప్రజానావ, గద్వాల : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రైస్ మిల్లులపై విజిలెన్స్ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ధాన్యం నిల్వలు, ప్రభుత్వానికి బియ్యం అప్పగింతల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో అధికారులు తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. తాజాగా శనివారం జోగులాంబ గద్వాల జిల్లాలోని పలు మిల్లుల్లోనూ తనిఖీలు నిర్వహించారు. కోట్ల రూపాయల విలువైన సీఎంఆర్ ధాన్యం మాయమైనట్లు వచ్చిన ఆరోపణలను అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మిల్లుల్లో ఉన్న ధాన్యం నిల్వలు, సంబంధిత రికార్డులు, ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యం వివరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. విజిలెన్స్ దాడుల నేపథ్యంలో కొందరు మిల్లు యజమానులు అందుబాటులో లేకుండా పోయారనే ప్రచారం జరుగుతోంది. అయితే తనిఖీల్లో వెల్లడయ్యే వాస్తవాలు, ధాన్యం నిల్వల్లో ఉన్న వ్యత్యాసాలు, ఈ వ్యవహారంలో బాధ్యులెవరనే అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. వరుస తనిఖీలతో రైస్ మిల్లుల వర్గాల్లో కలకలం నెలకొంది. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపడితే సీఎంఆర్ ధాన్యం నిల్వలు, బియ్యం అప్పగింతలకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

భద్రాచలంలోనే రామయ్య దసరా మహోత్సవాలు

- అభివృద్ధి పనులతో మారనున్న ఉత్సవాల నిర్వహణ
- దసరా మండపంలో రావణ వధకు ఏర్పాట్లు



ప్రజానావ, భద్రాచలం : భక్త రామదాసు కాలం నుంచి భద్రాచలంలోని దసరా మండపంలో శ్రీ సీతారామచంద్రస్వామి విజయదశమి మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా ఉత్సవాల నిర్వహణలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, రామయ్య దసరా మహోత్సవాలు ఆలయ ప్రాంగణంలోనే నిర్వహించే అవకాశముందని తెలుస్తోంది. డిసెంబరులో జరిగే ముక్కోటి ఏకాదశి నాటికి ఉత్తర ద్వారంతో పాటు వీలైనన్ని నిర్మాణ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇంజినీర్లు, నాణ్యత నియంత్రణ అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన ఆలయం వద్ద కొన్ని ఉత్సవాలు, దసరా మండపం వద్ద మరికొన్ని కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలనూ పరిశీలిస్తున్నట్లు సమా చారం. ఈ నెల 12న ప్రారంభమైన అమ్మవారి అలంకారాల క్రమంలో విజయదశమి సందర్భంగా 21న సంక్షేప రామాయణ పూర్ణాహుతి, మహా పట్టాభిషేకం నిర్వహించనున్నారు. పూదత్తాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా ప్రత్యేక భోగ నివేదన కూడా జరగనుంది. సంప్రదాయం ప్రకారం సాయంత్రం స్వామివారు ఆలయం నుంచి బయల్దేరి దసరా మండపానికి చేరుకుని పూజలు అందుకోవాలి. ప్రధాన గోపురం మీదుగా చిత్రకూట మండపం వైపు నుంచి రాజవీధిలో శోభాయాత్రగా సుమారు కిలోమీ టరు దూరంలోని దసరా మండపానికి స్వామివారిని తీసుకెళ్లడం ఆనవాయితీ. అయితే ప్రస్తుతం చిత్రకూట మండపం వైపు అభివృద్ధి పనులు కొనసాగుతుం డటంతో ఆ మార్గంలో ఊరేగింపు నిర్వహించడం సాధ్యం కాకపోవచ్చని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈసారి ఆలయంలోనే శమీ పూజ, ఆయుధ పూజ నిర్వహించి, సంప్రదాయం కొనసాగించేలా దసరా మండపం వద్ద రావణ వధ ఘట్టాన్ని నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. అయితే ఉత్సవాల నిర్వహణపై ఆలయ అధికారులు ఇంకా అధికారికంగా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. దీంతో భక్తుల్లో నెలకొన్న సందిగ్ధతకు తెరదించేందుకు ఆలయ యంత్రాంగం ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

రైతుల ముసుగులో జీరో మిర్చి వ్యాపారం

- శీతల గిడ్డంగుల నుంచి అక్రమంగా సరకు తరలింపు
- పన్నుల ఎగవేతతో ప్రభుత్వ ఆదాయానికి గండి
- అధికారుల అండపై ఆరోపణల



ప్రజానావ, ఖమ్మం : జిల్లాలోని శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉన్న వ్యాపారుల మిర్చి సరకు రైతుల పేరుతో అక్రమంగా తరలుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నా యి. ఖమ్మం, మద్దులపల్లి, మత్తేపల్లి, వైరా, మధిర వ్యవసాయ మార్కెట్ల పరిధిలో సుమారు 47 శీతల గిడ్డంగులు ఉండగా, వీటిలో గతేడాది వ్యాపారులు కొను గోలు చేసిన లక్షలాది బస్తాల మిర్చితోపాటు రైతుల సరకు నిల్వ ఉంది. ఇందులో 70 శాతానికిపైగా సరకు రైతుల దేనని అంచనా. అయితే కొందరు అధికారుల సహకారం తో మార్కెట్ సెస్సు, వస్తు సేవల పన్ను చెల్లింపుల నుంచి తప్పించుకునేందుకు కొందరు వ్యాపారులు రైతుల పేరుతో జీరో వ్యాపారం సాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శీతల గిడ్డంగి నుంచే అక్రమ రవాణా?

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సమీపంలోని మరో మార్కెట్ పరిధిలో కొత్తగా ఏర్పాటైన మార్కెట్ ప్రాంతంలో గత పది నుంచి పన్నెండు రోజులుగా జీరో విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం. ఓ శీతల గిడ్డంగి నుంచి వ్యాపారుల సరకు బహిరంగంగానే రైతుల పేరుతో నాగ్‌పూర్, కోల్‌కతా తదితర మార్కెట్లకు తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా చేయడం ద్వారా మార్కెట్‌కు చెల్లించాల్సిన ఒక శాతం సెస్సుతోపాటు ఐదు శాతం వస్తు సేవల పన్ను చెల్లించకుండా తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో మార్కెటింగ్ అధికారులకు ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గత వారం రోజుల్లోనే సుమారు నాలుగు వేల బస్తాల మిర్చిని తరలించినట్లు సమాచారం. ఈ సరకు విలువ దాదాపు రూ.35 లక్షలు ఉంటుందని, ప్రభుత్వానికి సుమారు రూ.2 లక్షల మేర ఆదాయ నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. సాధారణంగా ఒక రైతు 30 నుంచి 100 బస్తాల వరకు సరకు విక్రయించే అవకాశం ఉండగా, ఇక్కడ రైతుల పేరుతో వేలాది బస్తాలు తరలిస్తున్నట్లు ఆరోపణలు రావడం గమనార్హం. ఖమ్మం నగరంతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు మూడు శీతల గదుల్లో సరకు నిల్వ ఉంచినట్లు తెలుస్తోంది. సరకు విక్రయాల అనంతరం బిల్లులు, ఇతర వస్తు సేవల పన్ను సంబంధిత పత్రాలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సమీపంలోని మరో మార్కెట్ పరిధిలో ఉన్న శీతల గిడ్డంగి నుంచి ఓ వ్యాపారి కొద్ది రోజులుగా రైతుల పేరుతో సుమారు 32 లారీల మిర్చి బస్తాలను పొరుగు రాష్ట్రాలకు తరలించినట్లు సమాచారం. మార్కెటింగ్ అధికారులతో కుమ్మక్కై రైతుల పేరుతో సరకు తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలిస్తే ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

తనిఖీలు చేస్తున్నా ఆగని అక్రమాలు?

వ్యవసాయ మార్కెట్లలో అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 11 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఖమ్మం మార్కెట్‌లోనూ ఇటీవల కొద్దిరో జుల పాటు రికార్డులను తనిఖీ చేశారు. అయినప్పటికీ జిల్లా లోని పలు మార్కెట్ల పరిధిలో అక్రమాలు కొనసాగుతు న్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. శీతల గిడ్డంగులపై పర్యవేక్షణ లోపించడం, సరకు రవాణా రికార్డులను సమగ్రంగా తనిఖీ చేయకపోవడం వల్లే అక్రమాలకు అవకాశం కలుగుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉన్న సరకు వివరాలు, రైతుల పేరుతో జరుగుతున్న విక్రయాలు, రవాణా పత్రాలు, పన్నుల చెల్లింపులపై సమగ్ర విచారణ చేపడితే జీరో వ్యాపారం వెనుక ఉన్న వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.

నాలుగు లైన్ల రహదారి కోసం చిట్టెం పాదయాత్ర

- రూ.280 కోట్ల పనుల్లో జాప్యంపై నిరసన
- 30 కిలోమీటర్ల మేర పాదయాత్ర



ప్రజానావ, నారాయణపేట : మక్తల్–నారాయణపేట నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు ప్రారంభించడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి శనివారం పాదయాత్ర చేపట్టారు. ఉదయం 8 గంటలకు మక్తల్ నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర సుమారు 30 కిలోమీటర్లు సాగి మధ్యాహ్నం 12 గంటలకు నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌కు చేరుకోనుంది. అక్కడ రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేయనున్నారు. మక్తల్–నారా యణపేట ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. గతంలో ఈ రహదారిపై సుమారు 180 గుంతలు ఉన్న ట్లు గుర్తించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం) పద్ధతి లో నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి సుమారు రూ.280 కోట్ల నిధులు కేటాయించినట్లు మంత్రులు ప్రకటించినప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, అనంతరం జూలై 13న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి మరోసారి శంకుస్థాపన చేశారు. అయినా పనులు ముందుకు సాగకపో వడంతో రహదారి పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూర య్యాయి. 2023 అక్టోబర్ 9న అప్పటి ఎమ్మెల్యే చిట్టెం రామ్మో హన్‌రెడ్డి పనుల ప్రారంభానికి శంకుస్థాపన చేశారు. అయితే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం మారిన తర్వాత కూడా నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో వాహనదారుల ఇబ్బందులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రూ.280 కోట్లతో చేపట్ట నున్న నాలుగు లైన్ల రహదారి పనులను ఇకనైనా ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేయాలని చిట్టెం రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేస్తున్నారు.

తల్లిదండ్రుల కళ్ల ముందే కుప్పకూలిన ఇంజినీరింగ్ విద్యార్థి

- దుస్తులు కొంటుండగా విషాదం
- గుండెపోటుతో రాఘవ మృతి



ప్రజానావ, వైరా : దసరా సెలవులకు స్వగ్రామానికి వచ్చిన ఇంజినీరింగ్ విద్యార్థి గుండెపోటుతో మృతి చెందాడు. తల్లిదండ్రుల కళ్ల ముందే కుమారుడు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడులో ఈ ఘటన చోటుచేసుకుంది. పదో వార్డు కౌన్సిలర్ కిన్నెర కృష్ణ, విజయ దంపతులకు కుమార్తె కీర్తి, కుమారుడు రాఘవ ఉన్నారు. హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న రాఘవ దసరా సెలవుల నేపథ్యంలో రెండు రోజుల క్రితమే ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం ఓ వ్యాపారి దుస్తులు విక్రయించేందుకు బైక్‌పై వారి ఇంటికి వచ్చాడు. రాఘవ తల్లి దుస్తులు చూస్తుండగా, తండ్రిని ఉద్దేశించి 'నాన్నా.. ఈ చొక్కాలు నీకు బాగుంటాయి' అంటూ మంచంపై కూర్చున్న రాఘవ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. పరీక్షించిన వైద్యు లు అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధా రించారు. సెలవులకు సంతోషంగా ఇంటికి వచ్చిన కుమారుడు కొద్ది క్షణాల్లోనే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనతో గండగల పాడులో విషాదఛాయలు అలుముకున్నాయి.



పర్యాటక కేంద్రంగా నాగన్న బావి

చారిత్రక కట్టడం వద్ద జానపద గీతం చిత్రీకరణ

ప్రజానావ, ఎల్లారెడ్డి : కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల కేంద్రంలోని చారిత్రక జక్కాని నాగన్న బావి పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలతో అధికారులు పారిశుద్ధ్య, ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో 'థకిట షో' సంస్థ తమ 'భామ సుందరాలో' జానపద గీతాన్ని బావి ప్రాంగణంలో చిత్రీకరించింది. సుమారు 100 మంది కళాకారులతో రాత్రంతా చిత్రీకరణ నిర్వహించారు. చారిత్రక కట్టడానికి నష్టం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామపంచాయతీ సూచించగా, నిర్వాహకులు అంగీకరించి రూ.8 వేల రుసుము చెల్లించారు. బావి ప్రాంగణ నిర్వహణ, పరిశుభ్రత, సందర్శకుల సౌకర్యాల బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించడంతో వారికి ఉపాధి లభించనుంది. కలెక్టర్ కృషితో నాగన్న బావికి గుర్తింపు పెరుగుతోందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన కలెక్టర్



ప్రజానావ, ఎల్లారెడ్డి : కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించడంతో పాటు మహిళలతో కలిసి బతుకమ్మ ఆటల్లో పాల్గొన్నారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ పండుగకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. అందంగా బతుకమ్మలను పేర్చిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఎన్.వై. గిరి, రవితేజ, డీఆర్‌డీఏ అధికారి దామోదర్‌రెడ్డి, అదనపు డీఆర్‌డీఏ అధికారి విజయలక్ష్మి , టీజీవో ప్రతినిధులు దేవేందర్, సాయిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కాళేశ్వరం నీళ్లున్నా సాగుకు నీరేది?

రైతులకు పంట చేతికొచ్చే వరకు నిరంతర విద్యుత్ అందించాలి



ప్రజానావ, వేములవాడ: కాళేశ్వరం జలాలు అందుబాటులో ఉన్నా సాగునీరు అందక, విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. వేములవాడ నియోజకవర్గంలోని రుద్రంగి, కోనరావుపేట తదితర మండలాల్లో పంటలు చేతికొచ్చే దశలో విద్యుత్ కోతలు విధించడం వల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పంటలను కాపాడేందుకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని సమర్థంగా వినియోగించి చెరువులు, కుంటలు నింపడంలో ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో వ్యవహరించలేదని ఆరోపించారు. బొగ్గు కొరత, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా సమస్యలపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు.

ఎమ్మెల్యే మౌనం వీడాలి

రుద్రంగి, కోనరావుపేట ప్రాంతాల్లో రైతులు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎందుకు స్పందించడం లేదని చల్మెడ ప్రశ్నించారు. రైతులకు సాగునీరు, నిరంతర విద్యుత్ అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు వేములవాడ–చెక్కపల్లి రహదారిలోని సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు.

వేములవాడలో భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రులు

కాళరాత్రి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



ప్రజానావ, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 11 (లెవెన్) టైగర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో నవరాత్రుల ఏడవ రోజైన శనివారం అమ్మవారు శ్రీ కాలరాత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గాజుల పూజ, కుంకుమార్చన, పుష్పార్చనతో పాటు మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వతీ పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అక్రమాల ఆరోపణలు

- **అనర్హులకు ఇళ్లు.. అర్హులకు నిరీక్షణ**
- **లబ్ధిదారుల నుంచి డబ్బుల వసూళ్లంటూ ఫిర్యాదులు**



ప్రజానావ, కామారెడ్డి : జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనర్హులకు ఇళ్లు కేటాయిస్తూ, అర్హులను పక్కన పెడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాచారెడ్డి మండలం లక్ష్మీ రావులపల్లిలో అనర్హులకు ఇళ్ల మంజూరు చేశారంటూ గ్రామస్థులు పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బిచ్కుంద మండలం శాంతాపూర్‌లో ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన జాబితాలో అర్హుడి పేరు ఉన్నప్పటికీ ఇల్లు మంజూరు కాలేదని కమిటీ సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పనులు చేసుకునే తమకు పలుమార్లు దరఖాస్తు చేసినా ఫలితం లేదని బాధిత దంపతులు వాపోయారు. తమ దరఖాస్తు ఎంపీడీవో లాగిన్‌లోనే పెండింగ్‌లో ఉంటోందని తెలిపారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే ఇళ్లు ఉన్నవారు, పట్టణాల్లో నివాసాలున్నవారు కూడా పల్లెల్లో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. వివాహమైన మహిళల పేరిట కూడా ఇళ్లు మంజూరవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇందిరమ్మ కమిటీలు, క్షేత్రస్థాయి అధికారులు అర్హతలను సక్రమంగా పరిశీలించకపోవడం వల్ల నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందని విమర్శిస్తున్నారు. రాజకీయ కారణాలతో కొందరికి ఇళ్లు మంజూరు చేయడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

లబ్ధిదారుల నుంచి వసూళ్లంటూ ఆరోపణలు

మరోవైపు కొన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారి నుంచి కమిటీ సభ్యులు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం బయటకు చెబితే ఇళ్లను రద్దు చేయిస్తామని, ప్రభుత్వం ఇచ్చిన నిధులను తిరిగి వసూలు చేయిస్తామని బెదిరిస్తున్నట్లు సమాచారం. కామారెడ్డి నియోజకవర్గంలోని ఓ గ్రామంలో సర్పంచి లబ్ధిదారులతో పాటు ఇళ్లు నిర్మించే మేస్త్రీ నుంచి కూడా డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల కమిటీ సభ్యులు సమష్టిగా, మరికొన్ని చోట్ల వ్యక్తిగతంగా వసూళ్లకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి, అర్హులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కేసీఆర్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యలు

ప్రజానావ, జనగామ : కేసీఆర్ హయాంలోనే తెలంగాణలో ఆలయాలు అభివృద్ధి చెందాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జనగామ జిల్లా లింగాల గణపురం మండలంలోని జీడికల్ దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ జీర్ణావస్థలో ఉన్న ఆలయాలను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. జీడికల్‌ను పర్యాటక కేంద్రంగా ప్రకటించి రూ.5 కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. రాష్ట్రంలో కాళేశ్వరం ద్వారా సాగునీరు, 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించే అవకాశం ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు న్యాయం చేయడం లేదని విమర్శించారు. సాగునీరు, విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా రైతులకు సాగునీరు, విద్యుత్ అందించి వారి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలిచి పోరాడుతామని స్పష్టం చేశారు. అంతకుముందు ఆలయ పూజారులు మురళీధర్, సురేష్‌కుమార్ ఆలయ సంప్రదాయం ప్రకారం నిరంజన్‌రెడ్డికి స్వాగతం పలికారు. రిటైర్డ్ ఈవో కేకే రాములు, సిబ్బంది కొండబోయిన భరత్‌కుమార్, మల్లేశం పాల్గొన్నారు.







వేములవాడ ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- **ముందస్తు సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది**

ప్రజానావ, వేములవాడ: వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బింగి కీర్తన ఆధ్వర్యంలో ముందస్తు సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగలో భాగంగా ఎనిమిదో రోజైన శనివారం వెన్నముద్దల బతుకమ్మను పురస్కరించుకుని కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకల్లో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బింగి కీర్తన మాట్లా డుతూ.. తెలంగాణ రాష్ట్ర పండుగైన బతుకమ్మ ఆడపడుచులకు ఎంతో ప్రత్యేకమైనదని తెలిపారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి గౌరమ్మను పూజిస్తూ తొమ్మిది రోజులపాటు ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని పేర్కొన్నారు. ఎంగి లిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మ వరకు సాగే ఈ వేడుకలు ప్రకృతితో మనకున్న అవినాభావ సంబంధాన్ని చాటిచెబుతాయన్నారు. ప్రకృతిని ఆరాధించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు బతుకమ్మ పండుగ ప్రాధాన్యతను తెలియజేస్తుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిదో రోజున సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారని, సెలవు నేపథ్యంలో ఒకరోజు ముందుగానే మండల పరిషత్ కార్యాల యంలో ముందస్తు వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. వెన్నముద్దల బతుకమ్మ సందర్భంగా ప్రత్యేక ఫలహారాలను తయారుచేసి గౌరమ్మకు నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా వేములవాడ మండల ప్రజలందరికీ ఎంపీడీవో బింగి కీర్తన బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతోపాటు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది వినయకుమార్, రమాదేవి, అనురాధ, కళ్యాణి, ఉపాధి హామీ సిబ్బంది మనోహర్, వనజ, ఈ–పంచాయతీ సిబ్బంది రఘు, రమేష్, ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు వీణారాణి, మనీషా, కళావతి, నీరజ, జీవిత పాల్గొన్నారు. అలాగే ఆఫీస్ సబార్డినేట్లు శ్రీనివాస్, వినయ్, రమేష్, అశోక్, రాజేశ్వరి తదితరులు పాల్గొని బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించారు.

రామగిరి ఖిల్లాకు రోప్‌వే ఏర్పాటుకు కృషి

- **కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ప్రతిపాదన..**
- **పర్యాటక అభివృద్ధిపై కొత్త ఆశలు**



ప్రజానావ, పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లాలోని చారిత్రక రామగిరి ఖిల్లా అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ఖిల్లాకు రోప్‌వే ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రామగిరి ఖిల్లా అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనను వివరించారు.

పర్యాటక రంగానికి ఊతం

చారిత్రక ప్రాధాన్యం కలిగిన రామగిరి ఖిల్లాకు రోప్‌వే ఏర్పాటు చేస్తే పర్యాటకులు సులభంగా కొండపైకి చేరుకుని చారిత్రక కట్టడాలను సందర్శించే అవకాశం ఉంటుందన్నారు. దీంతో జిల్లాకు పర్యాటకంగా గుర్తింపు పెరగడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడే వీలుందన్నారు. పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతం మరింత ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానంగా మారే అవకాశం ఉండనుంది.

కేంద్ర నిర్ణయంపై ఆసక్తి

రామగిరి ఖిల్లా అభివృద్ధి కోసం ఎంపీ వంశీకృష్ణ కేంద్ర మంత్రి దృష్టికి ప్రతిపాదన తీసుకెళ్లడంతో స్థానికంగా ఆశలు చిగురిస్తున్నాయి. అయితే రోప్‌వే ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది. ప్రతిపాదనకు ఆమోదం లభించి, ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే పెద్దపల్లి జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి కొత్త మార్గం ఏర్పడనుంది.

సిరిసిల్లలో ఘనంగా అంబాభాయి నవరాత్రి ఉత్సవాలు

- **ఒడి బియ్యంతో మొక్కులు..**
- **నిత్యం అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు**



ప్రజానావ, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అంబాభాయి (జగదాంబ దేవి) నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 53 ఏళ్ల క్రితం పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు స్వర్గీయ వంగరి నరసయ్య నేతృత్వంలో వెంకంపేటలో ప్రారంభమైన ఈ ఉత్సవాలు ప్రస్తుతం సుభాష్‌నగర్, నెహ్రూనగర్, మార్కండేయ వీధి, బీవై నగర్, శాంతినగర్, పద్మానగర్, గాంధీనగర్ తదితర ప్రాంతాలకు విస్తరించాయి. ప్రస్తుతం వెంకంపేట ఉత్సవాలు వంగరి దేవదాస్ నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. నిత్యం ప్రత్యేక పూజలు, అన్నదానాలు, ఒగ్గు కథలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విజయదశమి రోజున జగదాంబ దేవిని రథంపై ఊరేగిస్తూ పట్టణంలో శోభాయాత్ర నిర్వహించి, మానేరు నది వద్ద నిమజ్జనం, ఘట విసర్జన కార్యక్రమాలు చేపట్టనున్నారు.



సద్దుల బతుకమ్మ, విజయదశమి శుభాకాంక్షలు

- **దసరా ఉత్సవాలకు అందరూ హాజరు కావాలి**
- **ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆహ్వానం**

ప్రజానావ, పెద్దపల్లి: రామగుండం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సద్దుల బతుకమ్మ, విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ సింగరేణి స్టేడియం మైదానంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు నియోజకవర్గ ప్రజలు కుటుంబ సమేతంగా హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

- **అందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు**
- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **వైభవంగా బతుకమ్మ సంబురాలు**
- **మహిళా అధికారులు, సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడిన జిల్లా కలెక్టర్**



ప్రజానావ, సిరిసిల్ల : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బతుకమ్మ సంబురాలు శనివారం వైభవంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత కార్యాలయాల సముదా యంలో మహిళా ఉద్యోగులు, సిబ్బంది రంగుర ంగుల పూలతో బతుకమ్మలను సిద్ధం చేశారు.ఈ సందర్భంగా బతుకమ్మ సంబురాలు నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి, బతుకమ్మ పాటలకు మహిళా అధికారు లు, సిబ్బందితో కలిసి ఆడిపాడారు. అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు కలెక్టర్ తెలియజేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మలు తీర్చిదిద్దారు. మొదటి బహుమతి జిల్లా వ్యవసాయ శాఖకు రాగా, రెండో బహుమతి రెవెన్యూ శాఖకు, మూడో బహుమతి శాఖకు ఎంపీపీఎస్ తంగళ్లపల్లి కి వచ్చింది. ఈ సందర్భంగా విజేతలకు జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా బతుకమ్మను అందంగా తీర్చిదిద్ది ఆడి పాడారని కొనియాడారు. ఆదివారం సిరిసిల్లలో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నామని వివరించారు. ముందస్తుగా అందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, వేములవాడ ఆర్డీవో కే ఎస్ బీ కుమారి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం, వివిధ శాఖల జిల్లా అధికారులు అష్జల్ బేగం, సౌజన్య, ఏంజెలా ఆల్ఫ్రెడ్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ఆందోళనలతో ఫ్రాన్స్‌లో ఉద్రిక్తతలు

- విద్యా సంస్కరణలు, మౌలిక సదుపాయాల కల్పనకు డిమాండ్
- కారుకు, దుకాణానికి నిప్పు

పారిస్ : విద్యార్థుల ఆందోళనలతో ఫ్రాన్స్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యావ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజులుగా విద్యార్థులు నిరసనలు చేస్తున్నారు. ఈ ఆందోళనలు కొన్ని చోట్ల విధ్వంసానికి దారితీశాయి. పారిస్‌లో నిరసనకారులు ఓ కారుకు, దుకాణానికి నిప్పంటించారు. ముఖాలకు ముసుగులు ధరించిన ఆందోళనకారులు పోలీసులపై బాణసంచా, ఇతర వస్తువులను విసిరారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జల ఫిరంగులను ప్రయోగించారు. మరోవైపు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో పెరుగుతున్న జీవన వ్యయాలకు వ్యతిరేకంగా పౌరులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థుల ఆందోళనలకు మద్దతుగా కూడా పలువురు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

సర్ రద్దు చేయాలి.. సీఈసీని తొలగించాలి

- ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా డీఎంకే తీర్మానం
- బ్యాలెట్ పేపర్ల పునరుద్ధరణకు డిమాండ్

చెన్నై : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సమీక్ష (సర్)ను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డీఎంకే డిమాండ్ చేసింది. బ్యాలెట్ పేపర్ల విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని కోరుతూ పార్టీ ఎంపీల సమావేశంలో తీర్మానం చేసింది. డీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాజకీయ వైఖరిని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న రాజకీయ నిరసనలకు దూరంగా ఉంటూనే, సర్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహిస్తున్న నిరసనలకు డీఎంకే మద్దతు ప్రకటించింది. సర్ విషయంలో కాంగ్రెస్, అధికార టీవీకే పార్టీలు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయని డీఎంకే ఆరోపించింది. సర్‌ను రద్దు చేయడం, సీఈసీని తొలగించడం, బ్యాలెట్ పేపర్లను పునరుద్ధరించడం తమ ప్రధాన డిమాండ్లని స్పష్టం చేసింది. చెన్నైలో నిర్వహించిన నిరసనలో పాల్గొన్న అనంతరం డీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి, పార్లమెంటరీ పార్టీ నాయకురాలు కనిమొళి కరుణానిధి ఈ విషయాలను వెల్లడించారు.

ఎక్స్‌ప్రెస్ వేపై ఘోర ప్రమాదం

- ఎనిమిది మంది మృతి
- కాలువలోకి దూసుకెళ్లిన టెంపో ట్రావెలర్
- మరో 15 మందికి గాయాలు



భోపాల్ : రాజస్థాన్‌లోని కోటా జిల్లాలో ఢిల్లీ–ముంబై ఎక్స్‌ప్రెస్ వేపై శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాకు చెందిన ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, మరో 15 మంది గాయపడ్డారు. ప్రయాణికులతో వెళ్తున్న టెంపో ట్రావెలర్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లడంతో ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న అత్యవసర సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ల సాయంతో వాహనంలో చిక్కుకున్న బాధితులను బయటకు తీశాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు తరలించారు. బాధితులు సికార్ జిల్లాలోని ఖాటూ శ్యామ్ ఆలయాన్ని దర్శించుకునేందుకు వెళ్తున్నట్లు తెలిసింది. డ్రైవర్ కునుకు తీయడం వల్లే వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగి ఉండొచ్చని గాయపడిన అన్నిక తెలిపినట్లు సమాచారం. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

వెదురు రిసార్ట్‌లో భారీ అగ్నిప్రమాదం

- 10 మంది మృతి
- మరో తొమ్మిది మందికి గాయాలు
- లోపల చిక్కుకున్న వారి కోసం గాలింపు



బంగ్లాదేశ్ : సముద్ర తీరంలోని వెదురుతో నిర్మించిన మూడంతస్తుల రిసార్ట్‌లో ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు వేగంగా వ్యాపించడంతో పై అంతస్తుల్లో ఉన్నవారు బయటకు రాలేక లోపలే చిక్కుకు పోయారు. ప్రమాదం జరిగిన సమయంలో రిసార్ట్‌లో సుమారు 30 మంది ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. వీరిలో నలుగురైదుగురు మాత్రమే బయట పడగా, 10 మంది మృతి చెందారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు, లోపల చిక్కుకున్న వారిని రక్షించేందుకు చర్యలు చేపట్టారు. మంటలు త్వరగా అదుపులోకి రాకపోవ డంతో భారీ నష్టం వాటిల్లింది. మృతదేహాలను స్వాధీనం చేసుకున్న అధికా రులు, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ఇంకా కొందరు లోపల చిక్కుకున్నట్లు అనుమానిస్తుండటంతో వారి కోసం గాలింపు కొనసాగుతోంది. అగ్నిప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. వంటగదిలో చెలరేగిన మంటలే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఘటనపై విచారణ కొనసాగుతోంది.



ఒకే కుటుంబంలో ఐదుగురి మృతి

- నూడుల్స్, టీ తిన్న తర్వాత విషాదం
- ఫుడ్ పాయిజన్ అనుమానం

నోయిడా : ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపింది. రబూపురా ప్రాంతంలోని నగ్లా శ్రీ పదమ్ గ్రామానికి చెందిన మహేశ్ (37), ఆయన భార్య లలిత (35), పిల్లలు లడ్డూ (11), మిష్టి (7), సాక్షత్ (3) శనివారం ఉదయం ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ముందు రోజు రాత్రి కుటుంబ సభ్యులంతా నూడుల్స్ తిన్న తర్వాత టీ తాగారని మహేశ్ తల్లి పోలీసులకు తెలిపినట్లు సమాచారం. ఆహారం, టీ తీసుకున్న తర్వాత అస్వస్థతకు గురై ఉండవచ్చని, ఆహార విషబాధ కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షల నివేదికలు వచ్చిన తర్వాతే మరణాలకు అసలు కారణం వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మహిళలపై పోలీసుల వేధింపులు

- మహిళా సంఘాల ఆగ్రహం
- పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ
- సీజేపీ వ్యవస్థాపకుడు దీప్కేకు షరతులతో బెయిల్

న్యూఢిల్లీ : ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో నిర్వహించిన నిరసనల సందర్భంగా మహిళలు, ట్రాన్స్‌జెండర్ ఆందోళనకారుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిరసనల్లో పాల్గొన్న మహిళలను లైంగికంగా వేధించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మహిళా సంఘాల నేతలు, కార్యకర్తలు గురుద్వారా బంగ్లా సాహిబ్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. 'మీరు మమ్మల్ని భయపెట్టగలరేమో కానీ.. మౌనంగా ఉంచలేరు' అంటూ నినాదాలు చేశా రు. పోలీసుల అణచివేత, దౌర్జన్యాలతోపాటు లింగవి వక్షకు పాల్పడ్డారని ఆరోపించారు. నిర్బంధంలోకి తీసుకున్న మహిళలను పోలీసు బస్సుల్లో, నిర్బంధ కేంద్రాల్లోనూ లైంగికంగా వేధించారని, కుల, మత వివక్ష ప్రదర్శించారని మండిపడ్డారు. పోలీసుల దుర్వ్యవహారంపై ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నిం



చినా స్వీకరించలేదని మహిళా సంఘాల నేతలు ఆరోపించారు. మహిళల గొంతును అణచివేసేందుకు స్త్రీద్వేషపూరిత చర్యలకు పాల్పడుతున్నారని విమర్శిం చారు. ఈ ఆందోళనలో ఐద్వా, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐపీడబ్ల్యూ, ఏఐఎంఎస్ఎస్, ఏఎల్ఐఎఫ్ఏ, ఏఐసీసీడబ్ల్యూడబ్ల్యూ, ప్రగతిశీల మహిళా సంఘటన్, పురోగామి మహిళా సంఘటన్ తదితర సంస్థలు పాల్గొన్నాయి. ఇదిలా ఉండగా, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు శనివారం షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్కులో సీజేపీ నిర్వహించనున్న 'లెహ్రో దో తిరంగా' కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తుండగా శుక్రవారం ఆయన నివాసం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో సమర్పించిన శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించారన్న ఆరోపణలపై శనివారం ఉదయం అరెస్టు చేశారు. అనంతరం ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ (ఎస్ఈఎం) ముందు హాజరుపరిచారు. మరో శాంతి ఒప్పందంపై సంతకం చేయడంతో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసి విడుదల చేసినట్లు ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. కాగా, 'లెహ్రో దో తిరంగా' నిరసనకు ముందు అదుపులోకి తీసుకున్న ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరాను శనివారం తెల్లవారుజామున విడుదల చేశారు.

కోల్‌కతాలో దుర్గా మండపం వద్ద తొక్కిసలాట

- 17 మంది మృతి
- 40 మందికిపైగా గాయాలు
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం ప్రకటించిన ప్రధాని మోదీ



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో దుర్గా నవరాత్రి ఉత్సవాల సంద ర్భంగా తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఉత్తర కోల్‌కతాలోని శారదా పార్కు వద్ద ఏర్పాటు చేసిన దుర్గా మండపంలో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో 17 మంది భక్తులు ప్రాణాలు కోల్పోగా, 40 మందికిపైగా గాయపడ్డారు. సప్తమి పూజల సందర్భంగా అమ్మవారిని దర్శించుకు నేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరా వడం, అదే సమయంలో వర్షం కురుస్తుం డటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో 13 మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను కోల్‌కతా మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు, విపత్తు నిర్వహణ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేప ట్టారు. మండప నిర్వాహకులు సైతం బాధి తులకు సహాయం అందించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం అంబులెన్స్‌ల సైరన్లు, బాధిత కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో విషాదభరితంగా మారింది. తొక్కిసలాటలో పలువురు స్పృహతప్పి పడిపోవడంతో వారి బంధువులు కొందరిని ద్విచక్ర వాహనాలపై ఆస్పత్రులకు తీసుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షి తెలిపారు. మండపంలోకి ప్రవేశించే, బయటకు వెళ్లే మార్గాలు ఇరుకుగా ఉండటంతోపాటు సరైన వెలుతురు కూడా లేదని మరో బాధితుడు ఆరోపించారు. ఈ ఘటనలో తన కుమార్తె, మనవరాలు గాయపడినట్లు వెల్లడించారు. ప్రమాదం ఎలా జరిగిందో అర్థం కావడం లేదని మండప పూజా నిర్వాహకుడు బికాస్ దాస్ తెలిపారు. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం రాత్రి 7.40 గంటల సమయంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఘటన అనంతరం మండప నిర్వాహకులు భక్తుల ప్రవేశాన్ని నిలిపివేసి లైట్లను ఆర్పివేశారు. బాధితులకు అవసరమైన సమాచారం అందించేందుకు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఉచిత సహాయవాణిని ఏర్పాటు చేసింది. ఈ విషాద ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు.

బిస్కెట్లు, పాలలో కల్తీ కలకలం

న్యూఢిల్లీ : ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తుల్లో కల్తీ ఉన్నట్లు గుర్తించడం కలకలం రేపింది. ప్రియా గోల్డ్ బిస్కెట్లు, దొడ్ల ఫుల్ క్రీమ్ పాల నమూనాల్లో నాణ్యతా లోపాలు, కల్తీ పదార్థాలు ఉన్నట్లు ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ ఎస్ఏఐ) తనిఖీల్లో వెల్లడైనట్లు సమాచారం. ప్రియా గోల్డ్‌బిస్కెట్ల తయారీ సంస్థ సూర్య అండ్ అగ్రోలో అధికారులు తనిఖీలు నిర్వహించగా, బిస్కెట్లలో పీచు పదార్థం కోసం పశువుల దాణాలో ఉపయో గించే ఊకను వినియోగిస్తున్నట్లు గుర్తించారు. మరోవైపు, దొడ్ల డెయిరీకి చెందిన ఫుల్ క్రీమ్ పాల నమూనాల్లో కొవ్వు శాతం తక్కువగా ఉన్నట్లు గుర్తించిన అధికారులు వాటిని ప్రయోగశాలకు పంపించారు. పరీక్షల్లో పాలలో డిటర్జెంట్, కాస్టిక్ సోడా ఉన్నట్లు తేలిందని సమాచారం. వీటితో పాటు యూఈఐఆర్ ఆర్గానిక్ ఫుడ్స్ సంస్థ విక్రయిస్తున్న పసుపు ఎండు ద్రాక్షలోనూ ప్రమాదకరమైన పురుగుమందుల అవశేషాలను అధి కారులు గుర్తించారు. ఈ మూడు సంస్థలపై కేసులు నమోదు చేసి, న్యాయపరమైన చర్యల్లో భాగంగా ప్రాసిక్యూషన్‌కు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



రష్యా చమురు కొనుగోలుదారులపై సుంకాలకు ట్రంప్ తాత్కాలిక బ్రేక్

భారత్ సహా ఇతర దేశాలపై 100 శాతం సుంకాల చట్టం నిలుపుదల

వాషింగ్టన్ : రష్యా నుంచి చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే భారత్ సహా ఇతర దేశాలపై 100 శాతం సుంకాలు విధించేందుకు వీలు కల్పించే చట్టాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. అమెరికా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన కాంగ్రెస్‌కు తెలిపారు. రష్యా నుంచి ఇంధన దిగుమతులు చేసుకునే దేశాలపై భారీ సుంకాలు విధించే బిల్లుపై ట్రంప్ గతంలోనే సంతకం చేసినప్పటికీ, సుంకాలు స్వయంచాలకంగా అమల్లోకి రాలేదు. చట్టం అమలుకు ముందు 12 నెలల కాలంలో రష్యా నుంచి అత్యధికంగా ముడి చమురు, సహజ వాయువును దిగుమతి చేసుకునే ఐదు దేశాలు, చట్టం అమల్లోకి వచ్చిన 30 రోజుల తర్వాత కూడా దిగుమతులను కొనసాగిస్తే వాటిపై 100 శాతం సుంకాలు విధించేలా ఈ ప్రతిపాదన రూపొందించారు. తాజాగా ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో ఈ సుంకాల అమలుకు తాత్కాలికంగా విరామం లభించింది.

అమెరికాలో వర్క్ పర్మిట్ నిబంధనల మార్పు

- 540 రోజుల ఆటోమేటిక్ పొడిగింపు రద్దు
- భారతీయులపై ప్రభావం

న్యూయార్క్ : అమెరికా ఉద్యోగ అనుమతుల నిబంధనల్లో కీలక మార్పు చేసింది. వర్క్ పర్మిట్ పునరుద్ధరణ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న సమయంలో ఉద్యోగం కొనసాగించేందుకు వీలు కల్పించే 540 రోజుల ఆటోమేటిక్ పొడిగింపు నిబంధనను రద్దు చేస్తున్నట్లు అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం ప్రకటించింది. ఈ నిర్ణయంతో హెచ్–4 వీసాలపై ఉన్న జీవిత భాగస్వాములు, ముఖ్యంగా హెచ్–1బీ వీసాదారుల కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. వర్క్ పర్మిట్ గడువు ముగిసి, కొత్త అనుమతి రాకపోతే వారు ఉద్యోగం కొనసాగించలేని పరిస్థితి ఏర్పడుతుంది. గతేడాది అక్టోబర్ 30 తర్వాత పునరుద్ధరణ దరఖాస్తులు సమర్పించిన వారికి కొత్త నిబంధనలు వర్తిస్తాయని అధికారులు వెల్లడించారు. అయితే ఎఫ్–1 వీసాలపై ఉన్న స్టీమ్ విద్యార్థులకు మాత్రం 180 రోజుల ఆటోమేటిక్ పొడిగింపు కొనసాగుతుందని అమెరికా స్పష్టం చేసింది.





నవంబర్ 1న కాంగ్రెస్ భారీ ర్యాలీ

- ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహణకు పోలీసుల అనుమతి
- సేవ్ డెమొక్రసీ' పేరుతో ఆందోళనకు సన్నాహాలు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక రాంలీలా మైదానంలో నవంబర్ 1న భారీ ర్యాలీ నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఇందుకు ఢిల్లీ పోలీసులు శనివారం నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) మంజూరు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సమీక్ష (సర్)కు వ్యతిరేకంగా ప్రతిపక్ష ఇండియా కూటమి ఆందోళనలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమా వేశంలో నిరసన కార్యక్రమాల నిర్వహణపై చర్చించి, రాజధానిలో భారీ ర్యాలీ చేపట్టాలని నిర్ణయించారు. అయితే, ఆందోళనలకు వేదికగా ఉపయోగిస్తున్న జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశాల జాబితా నుంచి తొలగించడంతో రాంలీలా మైదానంలో ర్యాలీ నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ మేరకు అనుమతి కోరుతూ ఢిల్లీ పోలీసులను ఆశ్రయించగా, అక్టోబర్ 25 నుంచి నవంబర్ 3 మధ్య ఏ రోజైనా ర్యాలీ నిర్వహించుకోవచ్చని పోలీసులు సూచించారు. అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం నవంబర్ 1న కార్యక్రమానికి అనుమతిస్తూ ఎన్‌వోసీ జారీ చేశారు. ర్యాలీ నేపథ్యంలో నిర్వాహకులు, ట్రాఫిక్ పోలీసులు, ఇతర సంబంధిత విభాగాలు సమన్వ యంతో పనిచేయాల్సి ఉంటుంది. ట్రాఫిక్ మళ్లింపు లు, శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన ఏర్పా ట్లు చేయనున్నారు. నిబంధనలకు అనుగుణంగా కార్యక్రమం నిర్వహించేలా పోలీసులు చర్యలు చేపట్టనున్నారు. 'సేవ్ డెమొక్రసీ' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి) పేరుతో ఈ ర్యాలీ నిర్వహించే అవకాశం ఉంది. ఇందులో కాంగ్రెస్ నాయకులు మాత్రమే పాల్గొంటారా, లేక ఇండియా కూటమిలోని ఇతర పార్టీల నేతలు కూడా హాజరవుతారా అనే అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

ఐదో రోజే ప్రెస్ సెక్రటరీకి ఉద్వాసన

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన కేట్ జచారియా ఐదో రోజుకే ఆ పదవి నుంచి తప్పుకున్నట్లు సమాచారం. మాజీ ప్రెస్ సెక్రటరీ కరోలినా లివియట్ ఆగస్టులో వైదొ లిగిన తర్వాత కేట్ ఈ బాధ్యతలు చేపట్టారు. అయితే మీడియా సమావేశాలను సమర్థంగా నిర్వ హించలేకపోవడం, ఆమె విద్యార్థులకు సంబం ధించిన న్యాయపట్టా అంశంపై వివాదం చెలరే గడంతో నియామకంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ ఆమెను పరోక్షంగా పదవి నుంచి తప్పుకోవాల్సిందిగా సంకేతాలు ఇచ్చినట్లు కథనాలు వెలువడ్డాయి. 42 ఏళ్ల కేట్ అధ్యక్షుడి తరపున దేశ ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని అందించడంతో పాటు రోజువారీ మీడియా సమావేశాల్లో పాల్గొనాల్సి ఉంది. అయితే బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే వివాదాలు చుట్టుముట్టడంతో ఆమె భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది.

భారత్ నిరసనలపై అమెరికా చట్టసభ్యుల లేఖ

- విద్యార్థులపై బలప్రయోగం ఆరోపణల ప్రస్తావనకు రూబియోకు విజ్ఞప్తి
- అంతర్గత వ్యవహారాల్లో జోక్యమంటూ భారత్ అభ్యంతరం

వాషింగ్టన్ : ఢిల్లీతోపాటు భారత్‌లోని ఇతర ప్రాంతాల్లో విద్యార్థుల నిరసనల సందర్భంగా మితిమీరిన బలప్రయోగం జరిగిందన్న ఆరోపణలను భారత ప్రతి నిధుల వద్ద ప్రస్తావించాలని అరుగురు అమె రికా డెమొక్రటిక్ చట్టసభ్యులు విదేశాంగ మంత్రి మార్కో రూబియోను కోరారు. పమీలా జయపాల్, ఇల్హాన్ ఒమర్, జిమ్ మెక్‌గవర్న్, రషీదా త్లైబ్, ఎలియనోర్ హోమ్స్ నార్టన్, జీన్ గార్సియా ఈ మేరకు రూబియోకు లేఖ రాశారు. అమెరికాలో నిరసనలు నిర్వహిస్తున్న వారిని గమనించేం దుకు వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యా లయం, ఇతర నగరా ల్లోని భారత కాన్సులే ట్‌లు ఫొటోగ్రాఫర్లను నియమించా యని వారు ఆరోపించారు. వచ్చే వారం భారత్‌లో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో రూబియో సమావేశం కానున్న నేపథ్యంలో ఈ అంశాలను ప్రస్తావించాలని కోరారు. అయితే పమీలా జయపాల్ వ్యాఖ్య లను అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా తీవ్రంగా ఖండించారు. వాటిని భారత అంతర్గత వ్యవహారాల్లో అమోదయోగ్యం కాని జోక్యంగా అభివర్ణిం చారు. రూబియోకు రాసిన లేఖపై పమీలా జయపాల్‌ను డెమొక్రటిక్ నాయకుడు, వైట్‌హౌస్ మాజీ సలహాదారు అజయ్ జైన్ భుటోరియా కూడా విమర్శించారు. మరో వైపు మానసిక ఆరోగ్యం, లింగ సమాన త్వంపై చర్చించి నందుకు భారత్‌లో యువత ప్రతీకారం లేదా వివక్షను ఎదు ర్కొంటు న్నారన్న ఐక్యరాజ్య సమితి ప్రత్యేక ప్రతినిధి గీనా రొమెరో వ్యాఖ్యలను భారత్ తిరస్కరించింది. ఈ ఆరోపణలు నిరాధార మైనవని, ధ్రువీకరిం చని వాదనలని ఐక్యరాజ్యసమితిలో భారత దౌత్యవేత్త అనుజ్ స్వరూప్ ఖండించారు. రొమెరో నివేదికలో భారత యువతకు సంబంధించి చేసిన వ్యాఖ్యలకు ఆధారాలే మిటని ప్రశ్నించారు. భారత ప్రధాన ఎన్ని కల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతి రేకంగా యువత నిరసనలు విస్తృతమవు తున్న నేపథ్యంలో ఈ నివేదిక వెలువడింది.



చివరి టీ20 వర్షార్పణం

భారత్–విండీస్ సిరీస్ 2–2తో సమం



బెంగళూరు: భారత్–వెస్టిండీస్ మధ్య ఉత్కంఠగా సాగిన ఐదు టీ20ల సిరీస్ 2–2తో ముగిసింది. శనివారం బెంగళూరులో జరగాల్సిన ఐదో, ఆఖరి టీ20 వర్షం కారణంగా రద్దయింది. తొలుత వర్షం వల్ల ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌ను తొమ్మిది ఓవర్లకు కుదించారు. బ్యాటింగ్‌కు దిగిన భారత్ 7.4 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. అనంతరం వర్షం ఎంతకీ తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు రాత్రి 10.18 గంటలకు ప్రకటించారు. దీంతో సిరీస్ 2–2తో సమమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఇషాన్ కిషన్ (30; 10 బంతుల్లో), నమన్ ధీర్ (24 నాటౌట్; 6 బంతుల్లో) మెరుపు ఇన్నింగ్స్‌లతో అండగా నిలిచారు. అభిషేక్ శర్మ (సిక్స్)తో దూకుడు ప్రారంభించినా, కీమో పాల్ బౌలింగ్‌లో షమర్ జోసెఫ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం



ఇషాన్ కిషన్ చెలరేగాడు. రొమారియో షెపర్డ్ వేసిన ఓవర్లో రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో 24 పరుగులు పిండుకున్నాడు. ముఖ్యంగా స్క్వేర్ లెగ్ మీదుగా కొట్టిన స్కూప్ సిక్స్ ఆకట్టుకుంది.

చివర్లో ధీర్ మెరుపులు

సంజూ శాంసన్ కూడా షమర్ జోసెఫ్ బౌలింగ్‌లో పాయింట్ మీదుగా అద్భుతమైన అప్పర్‌కట్‌తో అలరించాడు. అయితే ఇషాన్ కిషన్, శాంసన్ (వేగంగా ఆడే క్రమంలో) వికెట్లు కోల్పోయారు. కిషన్ క్యాచ్‌ను రోవ్‌మన్ పావెల్ అందుకోగా, శాంసన్‌ను షమర్ స్ప్రింగర్ బౌల్డ్ చేశాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (18 పరుగుల వద్ద క్యాచ్ వదిలేయడంతో బతికిపోయి) కొన్ని భారీ షాట్లు ఆడినా, కీమో పాల్ బౌలింగ్‌లో జోసెఫ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఏడో ఓవర్లో భారత్ 88/4తో నిలిచింది. చివరి రెండు ఓవర్లలో నమన్ ధీర్ విజృంభించాడు. పాల్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు, ఒక ఫోర్ బాది జట్టు స్కోరును 118కు చేర్చాడు. తిలక్ వర్మ మాత్రం వేగంగా పరుగులు చేయడంలో ఇబ్బంది పడ్డాడు.

విండీస్ నుంచి గట్టి పోటీ

సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో మొదలైన వర్షం కారణంగా ఆట రాత్రి 9.15 గంటలకు ప్రారంభమైంది. భారత ఇన్నింగ్స్ రాత్రి 10.03 గంటలకు మళ్లీ వర్షంతో నిలిచిపోయింది. ఐదు ఓవర్ల ఛేదనకు నిర్ణయించిన గడువు రాత్రి 10.21 గంటలు కాగా, వాన తగ్గకపోవడంతో ఆట సాధ్యపడలేదు. ఈ సిరీస్‌లో విండీస్ కెప్టెన్ షాయ్ హోప్ ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. నాలుగు మ్యాచ్‌ల్లో రెండు శతకాలతో కలిపి 261 పరుగులు సాధించాడు. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన భారత్‌కు విండీస్ గట్టి పోటీ ఇచ్చింది.




ముంబై కోచ్‌గా జయవర్ధనే ఔట్

- అధికారికంగా ప్రకటించిన ఫ్రాంచైజీ

ముంబై: ముంబై ఇండియన్స్ ప్రధాన కోచ్ పదవి నుంచి శ్రీలంక దిగ్గజం మహేల జయవర్ధనే వైదొలిగాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ శనివారం ప్రకటించింది. 2017–2022 మధ్య తొలి విడతలో జట్టుకు మూడు ఐపీఎల్ టైటిళ్లు అందించిన జయవర్ధనే.. 2025లో మరోసారి కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. అయితే ఆ ఏడాది నాలుగో స్థానానికి పరిమితమైన ముంబై.. 2026లో తొమ్మిదో స్థానంలో నిలిచింది. జయవర్ధనే సేవలను ముంబై యాజమాన్యం కొనియాడగా, తనపై నమ్మకం ఉంచిన నీతా అంబానీ, ఆకాశ్ అంబానీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపాడు. తాజా పరిణామంతో కొత్త కోచ్ ఎంపికపై ఫ్రాంచైజీ దృష్టి సారించింది. నవంబర్ 15న ఆటగాళ్ల రిటెన్షన్ గడువు ముగియనుంది.

హాంకాంగ్ సిక్సర్స్ కెప్టెన్‌గా కృనాల్

- భువనేశ్వర్ స్థానంలో ఖెజ్రోలియా



హాంకాంగ్: హాంకాంగ్ సిక్సర్స్ టోర్నీలో పాల్గొనే భారత జట్టు కెప్టెన్‌గా ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా నియమితుడయ్యాడు. తొలుత కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాల్సిన భువనేశ్వర్ కుమార్‌కు న్యూజిలాండ్ పర్యటన కోసం భారత జట్టులో చోటు దక్కడంతో ఈ మార్పు చేశారు. అతడి స్థానంలో గుజరాత్ టైటాన్స్ పేసర్ కుల్వంత్ ఖెజ్రోలియాకు అవకాశం కల్పించారు. అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు ఈ టోర్నీ జరగనుంది. కృనాల్ పాండ్యా సారథ్యంలో శశాంక్ సింగ్, రాహుల్ తెవాటియా, నితీశ్ రాణా, రాహుల్ త్రిపాఠి, టీ. నటరాజన్, కుల్వంత్ ఖెజ్రోలియా భారత జట్టులో ఉన్నారు. వీరంతా ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

రంజీ బరిలో గిల్

- నేటి నుంచి రెండో రౌండ్ పోటీలు

ముల్లాన్‌పూర్: దేశవాళీ ప్రతిష్ఠాత్మక ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నీ రంజీ ట్రోఫీ రెండో రౌండ్ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పంజాబ్ తరఫున బరిలోకి దిగనుండటం ఈ రౌండ్‌లో ప్రధాన ఆకర్షణ. తొలి మ్యాచ్‌లో అసోంపై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో మూడు పాయింట్లు సాధించిన పంజాబ్.. రెండో పోరులో ఛత్తీస్‌గఢ్‌ను ఎదుర్కోనుంది. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో 334 పరుగులతో రాణించి ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా నిలిచిన గిల్.. రంజీ బరిలోనూ సత్తా చాటాలని భావిస్తున్నాడు. గ్రూప్–బీలో ఆంధ్రతో తలపడనున్న హైదరాబాద్ తొలి రౌండ్‌లో త్రిపురపై ఇన్నింగ్స్ 40 పరుగుల తేడాతో గెలిచి ఏడు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ రెండు ఇన్నింగ్స్‌ల్లో తొమ్మిది వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు సౌరాష్ట్రతో ఆడనున్న కర్ణాటకకు శ్రేయస్ గోపాల్ నాయకత్వం వహించనున్నాడు. గాయాల నుంచి కోలుకున్న విద్వత్ కావేరప్ప, వైశాక్ విజయ్ కుమార్ తిరిగి జట్టులోకి రావడం ఆ జట్టుకు ఊరటనివ్వనుంది. తొలి మ్యాచ్‌లో ఆంధ్రతో డ్రా చేసుకున్న కర్ణాటక ఒక పాయింట్ సాధించింది.

ముంబైకి గాయాల బెడద

గ్రూప్–డీలో హిమాచల్‌ప్రదేశ్‌తో తలపడనున్న ముంబైకి యశస్వి జైస్వాల్ దూరమయ్యాడు. ఇండియా–ఎ జట్టుకు ఎంపికైన అతడితో పాటు, తొడ కండరానికి తీవ్ర గాయమైన ఆయుష్ మ్హాత్రే కూడా అందుబాటులో ఉండదు. మ్హాత్రే మరో



నెల రోజులు ఆటకు దూరమయ్యే అవకాశముంది. దీంతో దివ్యాంశ్ సక్సేనా, అంగ్‌క్రిష్ రఘువంశీ ఓపెనర్లుగా ఆడే అవకాశం ఉంది. సర్ఫరాజ్ ఖాన్ కూడా ఫామ్‌లోకి రావాల్సి ఉంది. గ్రూప్–సీలో ఢిల్లీ, సర్వీసెస్ జట్లు తొలి రౌండ్‌లో భారీ ఓటముల తర్వాత వరుసగా గుజరాత్, బెంగాల్‌తో తలపడనున్నాయి. ఒడిశాపై పది వికెట్లతో గెలిచిన గుజరాత్.. వేదాంత్ త్రివేది సెంచరీ, సిద్ధార్థ్ దేశాయ్ ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకుంది. బెంగాల్ కూడా ఢిల్లీపై తొమ్మిది వికెట్లతో విజయం సాధించింది. సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ ఐదు వికెట్లు తీయగా, సుదీప్ ఘరామి, అభిషేక్ పోరెల్ సెంచరీలు సాధించారు. గ్రూప్–ఏలో గోవాతో తలపడనున్న ఉత్తరప్రదేశ్ తొలి మ్యాచ్‌లో బిహార్‌పై ఇన్నింగ్స్ 267 పరుగుల భారీ విజయం సాధించింది. రింకూ సింగ్ సెంచరీతో, మాధవ్ కౌశిక్ 150 పరుగులతో రాణించారు. ప్లేట్ గ్రూప్‌లో సిక్కింపై అరుణాచల్‌ప్రదేశ్ బరిలోకి దిగనుంది.



బోపన్నకు బిగ్ షాక్!

- ఏఐటీఏ అత్యుత్తమ క్రీడాకారుల జాబితాలో దక్కని చోటు
- రిటైర్మెంట్ తర్వాత ఏడాది నిబంధనే అడ్డంకి
- నవంబర్ 5న టెన్నిస్ సంఘం ఎన్నికలు

న్యూఢిల్లీ: భారత టెన్నిస్ దిగ్గజం రోహన్ బోపన్నకు అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) ప్రకటించిన అత్యుత్తమ ప్రతిభావంతులైన క్రీడాకారుల (ఎస్‌ఓఎం) జాబితాలో చోటు దక్కలేదు. జాతీయ క్రీడా పాలన నిబంధనలు–2026 ప్రకారం, క్రియాశీల క్రీడలకు స్వస్తి పలికి కనీసం ఏడాది పూర్తయి ఉండాలన్న నిబంధన ఇందుకు కారణమైంది. 46 ఏళ్ల బోపన్న 2025 నవంబర్ 1న ప్రొఫెషనల్ టెన్నిస్‌కు వీడ్కోలు పలకగా, అక్టోబర్ 16న జాబితా ప్రకటించే సమయానికి ఏడాది గడువు పూర్తికాలేదు. జాబితాలో చోటు కోసం దరఖాస్తు చేసే సమయానికి ఏడాది పాటు క్రియాశీల క్రీడలకు దూరంగా ఉండడంతో పాటు, జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి ప్రాతినిధ్యానికి అర్హత కల్పించే పోటీల్లోనూ పాల్గొనకూడదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. బోపన్న తన అర్హతపై ఏఐటీఏ అడ్మినిస్ట్రేటర్ గీతా మిట్టల్‌ను సంప్రదించి, అర్హతపై హామీ వచ్చిన తర్వాతే దరఖాస్తు చేసినట్లు సమాచారం. 2024లోనే భారత జట్టుకు ఆడడం నిలిపివేసినా, అంతర్జాతీయ ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో 2025 వరకు కొనసాగడం ఆయనకు ప్రతికూలంగా మారింది.

43 ఏళ్ల వయసులో ప్రపంచ నెం.1గా

బోపన్న 2017 ఫ్రెంచ్ ఓపెన్‌లో మిక్స్‌డ్ డబుల్స్, 2024 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పురుషుల డబుల్స్ టైటిళ్లు గెలిచారు. 43 ఏళ్ల వయసులో పురుషుల డబుల్స్ ప్రపంచ నంబర్‌వన్‌గా నిలిచి రికార్డు సృష్టించారు. అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనే భారత ఆటగాళ్లకు ఆర్థిక, సాంకేతిక సహకారం అందించడంలోనూ కీలక పాత్ర పోషించారు. ఇక ఎస్‌ఓఎం జాబితా కోసం 42 మంది పురుషులు, 28మంది మహిళలు దరఖాస్తు చేసుకోగా, మొత్తం 40 మందిని ఎంపిక చేశారు. ఈ జాబితాలో లియాండర్ పేస్‌కు తొలి శ్రేణిలో చోటు దక్కింది. మహేశ్ భూపతి, సానియా మీర్జా రెండో శ్రేణిలో ఉన్నారు. ఇతర మాజీ ఆటగాళ్లు, కోచ్‌లు, క్రీడా ప్రతినిధులకు తదుపరి శ్రేణుల్లో స్థానం కల్పించారు. ఈ జాబితాలోని క్రీడాకారులు ఏఐటీఏ జనరల్ బాడీ, కార్యనిర్వాహక కమిటీల్లో తమ ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఓటు వేయనున్నారు. అక్టోబర్ 23 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 5న ఎన్నికలు జరగను న్నాయి.



హెచ్‌డీఎఫ్‌సీ లాభం రూ.20,700 కోట్లు

- 5.55 శాతం వృద్ధి.. తగ్గిన వడ్డీ మార్జిన్
- ఈ నెలాఖరులో కొత్త సీఈవోగా అనుప్ బాగ్చీ



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని 5.55 శాతం పెంచుకుని రూ.20,700 కోట్లకు చేర్చింది. అయితే ట్రెజరీ కార్యకలాపాల ప్రతికూల ప్రభావం లాభాల వృద్ధిని పరిమితం చేసింది. స్వతంత్ర నికర లాభం 4.7 శాతం పెరిగి రూ.19,510 కోట్లకు చేరింది. ఈ నెలాఖరులో అనుప్ బాగ్చీ బ్యాంకు ఎండీ, సీఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత ఎండీ, సీఈవో శశిధర్ జగదీశన్, డిప్యూటీ ఎండీ కైజాద్ భరూచా వైదొలగనున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ గృహ రుణ సంస్థతో విలీనం తర్వాత డిపాజిట్ల సమీకరణపై ఒత్తిడి పెరిగిందని జగదీశన్ తెలిపారు. బ్యాంకు నికర వడ్డీ మార్జిన్ 3.3 శాతం నుంచి 3.2 శాతానికి తగ్గగా, స్థూల మొండి బకాయిల నిష్పత్తి 1.17 శాతం నుంచి 1.11 శాతానికి మెరుగుపడింది.

ప్రపంచంలోనే ఉత్తమ బ్యాంకు ఎస్‌బీఐ

- గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ నుంచి 2026 పురస్కారం
- వరుసగా రెండో ఏడాది దక్కిన గుర్తింపు
- డిజిటల్ సేవలు, ఏఐ వినియోగానికి ప్రశంసలు
- 10 కోట్లు దాటిన యోనో యూజర్లు.. కొత్తగా 300కు పైగా శాఖలు

న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మరో అంతర్జాతీయ గుర్తింపు సాధించింది. 'ప్రపంచంలోనే ఉత్తమ వినియోగదారుల బ్యాంకు–2026' పురస్కారాన్ని గెలుచుకుంది. గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ అందించే ఈ అవార్డు వరుసగా రెండో ఏడాది ఎస్‌బీఐకి దక్కింది. డిజిటల్ ఆవిష్కరణలు, మెరుగైన సేవలు, ఆర్థిక సమ్మిళిత వృద్ధికి కృషి చేయడం ద్వారా వినియోగదారులకు కేంద్రంగా ఉండే బ్యాంకింగ్‌లో అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పినందుకు ఈ గుర్తింపు లభించినట్లు ఎస్‌బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) వార్షిక సమావేశం సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ.. డిజిటల్ రంగంలో బ్యాంకు చేపడుతున్న పరివర్తన



ద్వారా భారీ సంఖ్యలో వినియోగదారులకు విశ్వసనీయమైన సేవలను అందించడమే లక్ష్యమని తెలిపారు. సాంకేతిక సామర్థ్యాలతో మరింత మందికి వేగంగా సేవలు చేరువవుతాయని, అదే సమయంలో బ్యాంకింగ్ సేవలు వ్యక్తిగతంగా, సులభంగా, నమ్మకంగా ఉండేలా ఉద్యోగులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గతేడాది కాలంలో డిజిటల్ ఆవిష్కరణలు, సేవల నాణ్యత, ఆర్థిక సమ్మిళిత కార్యక్రమాలపై పెట్టుబడులను పెంచడం ద్వారా వినియోగదారులతో బ్యాంకు సంబంధాలను మరింత బలోపేతం చేసుకున్నట్లు వివరించారు. ఇక కొత్తగా ప్రారంభించిన యోనో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ఇప్పటికే 10 కోట్లకు మందికి పైగా వినియోగదారులు నమోదయ్యారు. ఏఐ ఆధారిత కస్టమర్ సేవలతో పాటు వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. దేశవ్యాప్తంగా 300కు పైగా కొత్త శాఖలను ప్రారంభించి తన సేవల పరిధిని విస్తరించింది. డిజిటల్ సాంకేతికతతో పాటు భౌతిక శాఖల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వడం బ్యాంకు వృద్ధికి దోహదపడిందని ఎస్‌బీఐ తెలిపింది.



ముంబైలో శుక్రవారం ఆడీ ఇండియా కొత్త క్యూ3 ఎస్‌యూవీని ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా, ఆడీ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్, సినీ నటి శర్వరీ వాఘ్, భారత మాజీ క్రికెటర్ రవిశాస్త్రి



ఫెడరల్ బ్యాంక్ బోర్డులో రాజేశ్ వారియర్

- మూడేళ్ల పాటు స్వతంత్ర డైరెక్టర్‌గా నియామకం

న్యూఢిల్లీ: ఫెడరల్ బ్యాంక్ బోర్డు స్వతంత్ర డైరెక్టర్‌గా కాగ్నిజెంట్ ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ రాజేశ్ వారియర్ నియమితులయ్యారు. అక్టోబర్ 16 నుంచి మూడేళ్ల పాటు ఈ నియామకం అమలులో ఉంటుందని బ్యాంకు వెల్లడించింది. బోర్డులోని ఇతర డైరెక్టర్లతో ఆయనకు ఎలాంటి బంధుత్వ సంబంధాలు లేవని స్పష్టం చేసింది. కాగ్నిజెంట్ భారత్ కార్యకలాపాలు, నాయకత్వ బృందం, వృద్ధి ప్రణాళికలు, పరివర్తన కార్యక్రమాల పర్యవేక్షణలో రాజేశ్ వారియర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన అనుభవం బ్యాంకు బోర్డుకు ఉపయోగపడనుంది.



పురుషాధిక్యతపై ప్రశ్నలు సంధించిన 'డోరోతీ'



మహిళలను త్యాగమూర్తులుగా, సున్నిత మనస్కులుగా చిత్రీకరిస్తూ, వారి త్యాగాలనే గొప్పగా చెప్పే సమాజం పురుషుల విషయంలో మాత్రం అదే విలువలను ఎందుకు పాటించదనే ప్రశ్నను 'డోరోతీ' సినిమా లేవనెత్తుతోంది. తల్లి తన ఆకలిని చంపుకుని పిల్లలకు అన్నం పెడుతుందని గొప్పగా చెబుతామని, మరి తండ్రి ఎందుకు అదే బాధ్యతను నిర్వర్తించకూడదని ప్రశ్నిస్తోంది. పురుషులు ఎలా ఉండాలి, ఎలా ప్రవర్తించాలి అనే సామాజిక కట్టుబాట్లు వారి భావోద్వేగాలను ఎలా అణచివేస్తున్నాయో ఈ చిత్రం చూపిస్తుంది. ఈ ఆలోచనలు అర్థం చేసుకునే సరికి తనకు 23 ఏళ్లు వచ్చాయని, ఇప్పటికీ పితృస్వామ్య భావజాలాన్ని పూర్తిగా అధిగమించానో లేదో తెలియదని, పురుషుడిగా ఉండటం వల్ల లభించే ప్రత్యేక హక్కులను అనుభవిస్తున్నాననే విషయాన్ని నిజాయితీగా అంగీకరించాలని సినిమా విశ్లేషణలో పేర్కొన్నారు. 1990ల నేపథ్యంలో సాగే ఈ కథలో కార్తీ, సుబ్బు చిన్నప్పటి నుంచి ప్రాణస్నేహితులుగా ఉంటారు. పురుషుడు ఎలా ఉండాలనే విషయంలో భిన్నమైన ఆలోచనలు కలిగిన ఈ ఇద్దరిలో ఒకరు కఠినమైన పురుషాధిక్య భావజాలాన్ని అనుసరిస్తే, మరొకరు సున్నితమైన మనస్తత్వాన్ని కలిగి ఉంటారు. వారు పెరిగి పెద్దయ్యాక వారి జీవితాలు ఎలా మారాయి, కులం, పురుషాధిక్యత, ప్రతీకార హింస వారి జీవితాలను ఎలా ప్రభావితం చేశాయన్నది కథలో ప్రధానాంశం. పురుషులకు కూడా ఎన్నో భావోద్వేగాలు ఉంటాయని, అయితే వాటిని బహిరంగంగా వ్యక్తపరచడాన్ని సమాజం బలహీనతగా చూస్తోందని ఈ చిత్రం చర్చిస్తుంది. పురుషులు ఏడవకూడదని, ఏడ్చే పురుషులను ఎగతాళి చేస్తూ అవమానకరమైన ముద్రలు వేస్తారని, ఇలాంటి భావజాలాన్ని దర్శకుడు ఎలాంటి సంకోచం లేకుండా కథలో భాగం చేశారని విశ్లేషణలో అభిప్రాయపడ్డారు. సినిమాలో కీర్తి సురేష్ పోషించిన డోరోతీ పాత్రకు ప్రత్యేక స్థానం ఉంది. సుబ్బు అన్నయ్య భార్యగా పురుషులే ఎక్కువగా ఉండే కుటుంబంలోకి అడుగుపెట్టిన ఆమె, తన భర్త కంటే సుబ్బుతో ఎక్కువ స్నేహాన్ని పెంచుకుంటుంది. ఈ స్నేహాన్ని కుటుంబ సభ్యులు, ముఖ్యంగా మామ, భర్త అనుమానంతో చూడటం ద్వారా ఆడ, మగ మధ్య స్నేహాన్ని సమాజం ఎలా అర్థం చేసుకుంటుందో చూపించారు. కథలోని అసలు విషయం తెలిసిన తర్వాత డోరోతీ పాత్రపై ప్రేక్షకుల అభిప్రాయాలు మారే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొన్నారు. భారతీయ సినిమాలో భిన్న లైంగిక గుర్తింపులు, క్వీర్ అస్తిత్వాలపై చర్చించే విభిన్న చిత్రాల్లో 'డోరోతీ' ఒక ముఖ్యమైన ప్రయత్నమని అభిప్రాయప డ్డారు. కథలోని మలుపులను ముందుగానే వెల్లడించకుండా, ప్రేక్షకులు స్వయంగా సినిమా చూసి అర్థం చేసుకోవాలని సూచించారు. పురుషుడు శారీరకంగా, మానసికంగా ఎలా ఉండాలో ఇతరులు నిర్ణయించడం, భిన్నమైన లైంగిక గుర్తింపులు, భావోద్వేగాల పట్ల అసహనం చూపడం వంటి అంశాలను ఈ చిత్రం ప్రశ్నిస్తుందని తెలిపారు. కులం, మతం, ప్రాంతం, వర్గం వంటి అసమానతలతో పాటు లింగ వివక్ష కూడా సమాజంలో లోతుగా పాతుకుపోయిందని, లింగ వివక్ష అంటే కేవలం స్త్రీ, పురుషుల మధ్య తేడా చూపడమే కాదని ఈ సినిమా గుర్తుచేస్తుందని పేర్కొన్నారు. సినిమా ముగింపును చూసి నవ్వేవారు, భిన్నమైన గుర్తింపుల పట్ల వ్యతిరేకత చూపేవారు తమ ఆలోచనా విధానాన్ని పరిశీలించుకోవాలని సూచించారు. పురుషులు కూడా తమ భావోద్వేగాలను స్వేచ్ఛగా వ్యక్తపరచవచ్చని, ఏడుపు వస్తే ఏడవడంలో తప్పేమీ లేదని సందేశమిచ్చే ఈ చిత్రంపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రతికూల ప్రచారాన్ని పక్కనపెట్టి, సినిమాను చూసి స్వయంగా అభిప్రాయం ఏర్పరచుకోవాలని విశ్లేషణలో కోరారు.

షారుఖ్ లాంటి రొమాంటిక్ వ్యక్తిని చూడలేదు

టాలెంటెడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ సినిమాలకు కొంత విరామం ఇచ్చినా, తన వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. ఇటీవల 'పూజా మేరీ జాన్' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఈ భామ తాజాగా ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్‌పై తన అభిమానాన్ని చాటుకున్నారు. షారుఖ్ తన జీవితంలో లేకపోవడం గుండెను ముక్కలు చేసే విషయమని, ఆయన తెరపై పండించిన ప్రేమకథలు రొమాన్స్‌కు కొత్త ప్రమాణాలను ఏర్పరిచాయని పేర్కొన్నారు. షారుఖ్ తెరపై పోషించిన పాత్రలంటే తనకు ఎంతో ఇష్టమని, ఆయనలా రొమాంటిక్‌గా ఉండే వ్యక్తిని ఇప్పటివరకు కలవలేదని చెప్పుకొచ్చారు. ఇదే సందర్భంలో వ్యక్తిగత బంధాలు ఎలా ఉండాలనే అంశంపైనా మృణాల్ తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఏ బంధంలోనైనా పరస్పర సంభాషణ ఎంతో ముఖ్యమని, భాగస్వాముల మధ్య గొడవలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించకుండా కొంత సమయం తీసుకుని ప్రశాంతంగా మాట్లాడుకోవాలని సూచించారు. ఎదుటివారి మనసులో ఏముందో ఊహించుకోవడం కంటే, తమ భావాలను స్పష్టంగా చెప్పుకుంటూ ఒకరినొకరు అర్థం చేసుకోవడమే బంధానికి పునాది అని వివరించారు. ఈ సూత్రం ప్రేమ సంబంధాలకే పరిమితం కాదని, తల్లిదండ్రులు, పిల్లల మధ్య కూడా భావాలను స్వేచ్ఛగా పంచుకోవడం అవసరమని అభిప్రాయపడ్డారు. స్నేహితులతో పోలిస్తే తాను తల్లిదండ్రులతోనే ఎక్కువ విషయాలను పంచుకుంటానని వెల్లడించారు. ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకోవడానికి స్పష్టమైన సంభాషణే కీలకమని మృణాల్ పేర్కొన్నారు. ప్రస్తుతం షారుఖ్‌పై ఆమె చేసిన వ్యాఖ్యలతో పాటు బంధాల గురించి వెల్లడించిన అభిప్రాయాలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి.



ఎల్‌నినోపై అవగాహనకు సినీ పరిశ్రమ సహకారం

ఎల్‌నినో ప్రభావంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సినీ పరిశ్రమ ముందుకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన పిలుపునకు టాలీవుడ్ అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున స్పందించారు. 'ఇట్లు అర్జున' సినిమా వేడుకలో మాట్లాడిన ఆయన, ఎల్‌నినో ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతోందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతో అవసరమని అన్నారు. ఈ ప్రయత్నంలో సినీ పరిశ్రమకు చెందిన వారంతా సహకరించేందుకు ముందుకు వస్తారని తెలిపారు. సమస్యలు ఎదురైనప్పుడు సాయం చేయడంలో సినీ పరిశ్రమ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం ఎప్పటివరకు కొనసాగుతుందో తెలియదని, ఈ నేపథ్యంలో ప్రజలు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని సూచించారు. కాగా, రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి, నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో నీరు, విద్యుత్ కొరత రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొంటూ, రైతులు ఒక పంటను విరమించుకుని ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రముఖ సంగీత దర్శకుడు దేవా కన్నుమూత



చిత్ర పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సంగీత దర్శకుడు దేవా (75) శనివారం చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తనదైన సంగీతంతో దక్షిణాది చిత్ర పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన మృతి పట్ల సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. చెన్నైలోని మైలాపూర్‌లో జన్మించిన దేవా తమిళం, తెలుగు, మలయాళం తదితర భాషల్లో 400కుపైగా చిత్రాలకు సంగీతం అందించారు. 1986లో విడుదలైన 'మాట్టుక్కార మన్నన్' చిత్రంతో తమిళ సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఆయన, ప్రశాంత్ నటించిన 'వైగాసి పొరంధాచ్చు' సినిమాతో మంచి గుర్తింపు సంపాదించారు. అనంతరం ఎన్నో విజయవంతమైన చిత్రాలకు సంగీతాన్ని అందిస్తూ తనకంటూ ప్రత్యేకమైన శైలిని ఏర్పరచుకున్నారు. తెలుగులో 'తొలిప్రేమ', 'మాస్టర్', 'ఆటోడ్రైవర్', 'ప్రేమలేఖ', 'భాషా', 'పంచతంత్రం', 'నాగ' వంటి చిత్రాలకు స్వరాలు సమకూర్చి తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు. తన సోదరుడు చంద్రబోస్‌తో కలిసి మ్యూజిక్ బ్యాండ్‌ను సైతం నిర్వహించారు. ముఖ్యంగా తమిళ చిత్ర పరిశ్రమలో 'గానా పాటల'కు దేవా పెట్టింది పేరుగా నిలిచారు. ఇళయరాజా వంటి దిగ్గజ సంగీత దర్శకుల హవా కొనసాగుతున్న సమయంలోనూ తన విభిన్నమైన సంగీత శైలితో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ సుదీర్ఘకాలం ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకున్నారు. తన బాణీలతో ఎన్నో తరాల సంగీతాభిమానులను అలరించిన దేవా మరణం దక్షిణాది చిత్ర పరిశ్రమకు తీరని లోటుగా పలువురు పేర్కొంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సినీ ప్రముఖులు సానుభూతి తెలియజేస్తున్నారు.

ట్రాక్టర్ నడుపుతూ కీర్తి సురేష్ మాస్ సందడి

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్‌రామ్ కలయికలో తెరకెక్కుతున్న క్రేజీ మల్టీస్టారర్ 'జనవరి 12 విడుదల' సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. 'బావ బామ్మర్ది సొజన్యంతో' అనే సరదా ఉపశీర్షికతో రూపొందుతున్న ఈ చిత్రానికి విజయవంతమైన దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ సినిమాలో జాతీయ పురస్కార గ్రహీత కీర్తి సురేష్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. కీర్తి సురేష్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమె 'లతా రెడ్డి' అనే పల్లెటూరి మాస్ పాత్రలో కనిపించనున్నారు. లంగా ఓణీ ధరించి, తలకు రుమాలు చుట్టుకుని ట్రాక్టర్ నడుపుతున్న కీర్తి లుక్ ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్‌తో సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉండబోతోందన్న ఆసక్తి నెలకొంది. సంక్రాంతి నేపథ్యంలో సాగే వినోదాత్మక కథలో కీర్తి అల్లరి ప్రేక్షకులను అలరించనుందని చిత్ర బృందం భావిస్తోంది. జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ప్రస్తుత చిత్రీకరణ చివరి దశకు చేరుకున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. వెంకటేష్, కళ్యాణ్‌రామ్ కలయికకు అనిల్ రావిపూడి వినోదం తోడవుతుండటంతో ఈ చిత్రంపై సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

అనిరుధ్-కావ్యా మారన్ పెళ్లి వార్తలు..

రిసెప్షన్‌పై సీఎంవో ప్రకటన




ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్యా మారన్ మధ్య ప్రేమ వ్యవహారం ఉందంటూ కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. వీరిద్దరూ త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు గతంలోనూ వినిపించినప్పటికీ, తాజాగా మరోసారి ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. వీరి వివాహ విందు నవంబర్ 21న చెన్నైలో జరగనుందంటూ తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం పేరుతో వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. కావ్యా మారన్ తల్లిదండ్రులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వేడుకకు ఆహ్వానించారంటూ ఓ ఫొటో కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. మరోవైపు, వీరి వివాహం గ్రీస్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో జరగనుందంటూ ప్రచారం సాగుతోంది. అయితే, అనిరుధ్, కావ్యా మారన్ వివాహంపై ఈ వార్తలకు సంబంధించి అధికారికంగా ధ్రువీకరించిన సమాచారం అందుబాటులో లేదు. దీంతో ఈ ప్రచారంలో వాస్తవమెంతనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇదిలా ఉండగా, ఈ వార్తలు నెట్టింట వైరల్‌గా మారడంతో సినీ, క్రికెట్ అభిమానులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. వీరిద్దరి బంధంపై వస్తున్న కథనాలపై నెటిజన్లు ఆరా తీస్తుండగా, అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

ఓటీటీలోకి విజయ్ సేతుపతి బత్త



విభిన్న కథలను ఎంచుకుంటూ తనదైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకునే కోలీవుడ్ నటుడు విజయ్ సేతుపతి మరోసారి వార్తల్లో నిలిచారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'బత్త' ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. బాలాజీ తరుణీతరం దర్శకత్వం వహించిన ఈ చిత్రం 1986 నాటి మద్రాస్ నేపథ్యంలో సాగే విభిన్నమైన గ్యాంగ్‌స్టర్ కథతో తెరకెక్కింది. ఇందులో మాస్టర్ సాయి పృథ్వీరాజ్, లిజోమోల్ జోస్, అజయ్ ఘోష్, అర్జున్ చిదంబరం కీలక పాత్రల్లో నటించారు. అక్టోబర్ 1న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపలేకపోయిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ వేదికపై ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకున్నట్లు సమాచారం. తాజా ప్రచారం ప్రకారం, అక్టోబర్ 29 నుంచి ఈ చిత్రాన్ని ప్రసారం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడతో పాటు హిందీ భాషల్లోనూ అందుబాటులోకి రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, స్ట్రీమింగ్ తేదీ, భాషల వివరాలపై నెట్‌ఫ్లిక్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. థియేటర్లలో ఈ సినిమాను చూడలేకపోయిన విజయ్ సేతుపతి అభిమానులు ఓటీటీ విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



ఈ నగరానికి ఏమైంది రిపీట్‌లో

శివాత్మిక సందడి

టాలీవుడ్ సీనియర్ హీరో రాజశేఖర్ చిన్న కుమార్తె శివాత్మిక రాజశేఖర్ మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలను అందుకుంటూ తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె ఖాతాలో తాజాగా 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' చిత్రం చేరింది. ప్రతిభావంతుడైన దర్శకుడు తరుణ్ భాస్కర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో శివాత్మిక 'కీర్తన' అనే విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. తాజాగా విడుదల చేసిన పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది. 'మంచోడిలా ఉన్నాడమ్మా.. ఫ్రీడమ్ ఇస్తున్నాడు' అనే ఆసక్తికరమైన వ్యాఖ్యతో విడుదల చేసిన పోస్టర్‌లో శివాత్మిక నల్లటి కళ్లద్దాలు ధరించి, చెంపపై టికెట్ అంటించుకుని ముద్దు పెడుతున్న ప్రత్యేకమైన రూపంలో కనిపించారు. దీంతో యువ ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ కల్ట్ సీక్వెల్‌లో విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, వెంకటేశ్ కాకుమాను కీలక పాత్రల్లో నటిస్తుండగా, ఈసారి శ్రీనాథ్ మాగంటి స్థానంలో సుశాంత్ ప్రేక్షకులను నవ్వించేందుకు సిద్ధమవుతున్నారు. రూట్‌నోడ్ సినిమా పతాకంపై శృజన్ యెరబోలు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని నవంబర్ 19న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. శివాత్మిక పాత్ర, వినోదభరిత మైన కథనం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటాయో వేచి చూడాలి మరి.



Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.